# క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

హైదరాబాద్
8-9-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 167

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## తాతా మధును డిస్మిస్ చేయాలి..

**కేసీఆర్ క్షమాపణ చెప్పాల్సిందే: సీఎం రేవంత్ డిమాండ్**

**స్పీకర్ గౌరవానికి భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారంటూ తాతా మధుపై సీఎం ఆగ్రహం**

**ఈ వ్యవహారంపై రాజకీయాలకు అతీతంగా స్పందించాల్సిన అవసరం ఉందని రేవంత్‌రెడ్డి వ్యాఖ్య**

**22ఏ, ధరణి అంశాలపైనా చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టీకరణ**

హైదరాబాద్:శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యల వివాదం అసెంబ్లీలో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. తాతా మధుతో రాజీనామా చేయించాలని,

మిగతా 2లో

# అసెంబ్లీ బహిష్కరణ!

## సభలోకి వెళ్లకుండా పోలీసులతో అడ్డుకున్నారంటూ..

**తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు ప్రారంభం అయ్యాయి. అయితే తెలంగాణ శాసనసభ వేదికగా ప్రతిపక్ష బీఆర్ఎస్, అధికార కాంగ్రెస్ మధ్య రాజకీయ చిచ్చు రాజుకుంది. అది వీధులకు ఎక్కింది.**

**అధికారపక్షంపై గులాబీ ఎదురుదాడి**

**రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఆందోళనలకు పిలుపు..**



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :**

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపిస్తూ.. నల్ల చొక్కాలతో శాసనసభకు హాజరయ్యేందుకు గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు వచ్చారు. వారిని గేటు వద్దే పోలీసులు నిలిపివేసి అదుపులోకి తీసుకున్నారు. దీనిని గులాబీ దళం తీవ్రంగా పరిగణిస్తోంది. పోలీసుల అణచివేత ధోరణికి, ప్రజాప్రతినిధుల పట్ల ప్రవర్తించిన అమానుష వైఖరికి నిరసనగా.. రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బిఆర్ఎస్ అధిష్టానం పిలుపునిచ్చింది. దీంతో ఇక భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు సభకు హాజరు కారు అని ప్రచారం నడుస్తోంది.

**గులాబీ పార్టీ నేతల ఆగ్రహం..**

శాసనసభలో సమస్యలపై మాట్లాడేందుకు వెళ్తున్న ఎమ్మెల్యేలను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. అసెంబ్లీ ప్రాంగణం వద్ద గులాబీ ప్రజాప్రతినిధుల పట్ల పోలీస్ యంత్రాంగం

- మిగతా 2వ పేజీలో



## సభకు కెసిఆర్!

**మూడేళ్లుగా ఇదే మాట**

**ఎందుకు రావట్లేదు అన్నది సూటిగా చెప్పలేకపోతున్న గులాబీ బాస్**

**అస్త్రంగా మలుచుకుంటున్న అధికార పార్టీ**

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో ఒక ప్రశ్నకు ఇప్పటివరకు సమాధానం లేదు. గత ఎన్నికల్లో ఓడిపోయిన తరువాత సీఎం గా

- మిగతా 2,3వ పేజీలో



## స్థానిక ఎన్నికల బహిష్కరణ!


**వైసిపి వ్యూహకర్తల కొత్త ఆలోచన**

**పోటీకి ముందుకు రాని చోటా నేతలు**

**అందుకే శాంతి భద్రతల పేరుతో పక్కకు తప్పుకునేందుకు ప్రయత్నం**

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో**

తెలంగాణలో కాంగ్రెస్ హై కమాండ్ దూకుడుగా ఉంది. ముఖ్యంగా క్రమశిక్షణ కమిటీ చాలా సీరియస్గా నిర్ణయాలు తీసుకుంటుంది.. టిపిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి నేతృత్వంలో వరుసగా నోటీసులు జారీ చేస్తోంది. కొండా సురేఖ, చిన్నారెడ్డిలపై చర్యల తరువాత మరింత వేగవంతం చేసింది. ఆదివారం ఒక్కరోజే ఏడుగురు కీలక నేతలకు క్రమశిక్షణ సంఘం నుంచి నోటీసులు వెళ్లాయి. ఎంపీ గడ్డం వంశీకృష్ణ నుంచి గజ్వేల్ తూంకుంట నరసారెడ్డి వరకు కీలక నేతలు ఈ జాబితాలో ఉన్నారు.




## మొన్న కొండా సురేఖ, చిన్నారెడ్డిలపై..

- తాజాగా ఓ ఏడుగురు నేతలకు క్రమశిక్షణ కమిటీ నోటీసులు
- ఎంపీ గడ్డం వంశీకృష్ణకు సైతం
- స్పష్టమైన సంకేతాలు పంపిన కాంగ్రెస్ హై కమాండ్

**పరిస్థితి చేయి దాటుతుండడంతో..**


గత కొద్ది కాలంగా కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ చర్యలు విషయంలో చూసి చూడనట్టుగా వెళ్ళింది హై కమాండ్. కానీ ఇప్పుడు పరిస్థితి చేయి దాటుతుండడంతో చాలా వేగంగా స్పందిస్తోంది. ఇంతకాలం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో.. ఏమీ కాదులే అన్న ఉద్దేశంలో ఒకరి తర్వాత ఒకరు అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వచ్చారు. అందుకే పార్టీలో ఎంత పెద్ద నేత అయిన ఉపేక్షించకూడదు అన్న నిర్ణయానికి వచ్చింది కాంగ్రెస్ హై కమాండ్. పార్టీ లైవ్ దాటిన వారికి నోటీసులు ఇచ్చి సంజాయిషీ తీసుకోవాలని ఆదేశించింది. సంతృప్తిగా సమాధానం చెప్పని వారిపై వేటు వేయాలని కూడా ఆదేశించింది.

## దసరాకు కొత్త పార్టీ!

**సీఎం అభ్యర్థిగా తాను ఉండను**

**తన కుటుంబ సభ్యులకు కూడా పదవుల్లో ఉండరు**

**విజయసాయిరెడ్డి కీలక ప్రకటన**



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కీలక ప్రకటన చేశారు. గత కొంతకాలంగా రాజకీయ పార్టీ పెడతానంటూ చెబుతూ వచ్చిన ఆయన

మిగతా 2లో



## విజయవాడ మేయర్‌గా వంగవీటి!

**రాధాకృష్ణ పేరును పరిశీలించాలని కోరుతున్న అభిమానులు**

**ఇప్పటికే ఆ పదవిపై బోండా ఉమామహేశ్వరరావు కుమారుడు ఆశలు**

**ఒక్కొక్కరుగా ముందుకొస్తున్న ఆశావాహులు**

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గా వంగవీటి రాధాకృష్ణ పదవి చేపట్టాలని ఆయన అభిమానులు కోరుకుంటున్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద కార్పొరేషన్లలో విజయవాడ ఒకటి. అమరావతి రాజధానికి సమీపంలో ఉన్న

మిగతా 3లో



# క్యాబినెట్ ప్రక్షాళన!

**మంత్రివర్గంలోకి రాములమ్మ, ప్రొఫెసర్ కోదండరాం**

**టిపిసిసి చీఫ్ మహేష్ గౌడ్ తో పాటు స్పీకర్ గడ్డం ప్రసాద్ సైతం**

**మూడో వారంలోనే..**



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో క్యాబినెట్ ప్రక్షాళనకు సీఎం రేవంత్ సర్వం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ముహూర్తం దాదాపు ఖరారు అయింది. ఢిల్లీలో జరిగిన చర్చల వేళ కొత్త లెక్కలు తెరమీదకు వస్తున్నాయి. మంత్రివర్గంలోకి టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ తో పాటు విజయశాంతి, కోదండరాములకు అవకాశం ఖాయమని తెలుస్తోంది. అదే సమయంలో కొత్త టీపీసీసీ చీఫ్ పదవికి మరో నేతను ఎంపిక చేసినట్లు కూడా ప్రచారం జరుగుతుంది. ఈనెల మూడో వారంలో మంత్రివర్గ విస్తరణ జరగనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పార్టీ హై కమాండ్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

## చేతులు కాలాక.. సుస్మిత పటేల్ ఏడుపులు!

**తన మూలంగా తల్లి సురేఖ మూల్యం చెల్లించుకున్నారంటూ రోదన**

**సోషల్ మీడియాలో వీడియో వైరల్**



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** రాజకీయాల్లో ఉన్నవారు పొదుపుగా మాట్లాడాలి. నోటిని అదుపు చేసుకోవాలి. వారు ఎంత సౌమ్యంగా

మిగతా 2లో

క్రైమ్ మిర్రర్
తెలంగాణ

మంగళవారం
8-9-2026

# చేతులు కాలాక.. సుస్మిత పటేల్ ఏడుపులు!

ఉంటే అంత తెలివైన వారు అని సమాజం భావిస్తుంటుంది. అలాగని ఒక్కోసారి దూకుడుగా కూడా వ్యవహరించాలి. కానీ అదే దూకుడు అన్ని సమయాల్లో, అన్నిచోట్ల పనిచేయదు. అందుకే అన్ని సమపాళ్లలో ఉండాలి అంటారు. అయితే ఇప్పుడు తెలంగాణలో సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలకు ఆమె తల్లి కొండా సురేఖ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. మంత్రి పదవి వదులుకోవాల్సి వచ్చింది. దాదాపు రెండు సంవత్సరాల పదవి వదులుకోవడం అంటే చిన్న విషయం కాదు. అయితే చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఇప్పుడు తెగ బాధ పడిపోతున్నారు సుస్మిత పటేల్. ప్రత్యేకంగా ఒక వీడియో విడుదల చేసి.. తాను చేసిన తప్పుకు తన తల్లి మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందంటూ కన్నీరు మున్నీరు అవుతున్నారు. కచ్చితంగా ఇది సుస్మిత పటేల్ స్వయంకృతాపరాధం. ఆపై పుత్రికా వాత్సల్యంతో కొండా సురేఖ అతిగా వ్యవహరించారు. అప్పటికప్పుడు ఆ పరిస్థితిని చక్కదిద్దే అవకాశం ఉన్న ఆమె జారవిడుచుకున్నారు.

**ఒకరిపై ఒకరికి నమ్మకం..**

2023 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించింది కాంగ్రెస్ పార్టీ. ఆ సమయంలో కొండా ఫ్యామిలీ రేవంత్ కు అండగా నిలబడింది. రేవంత్ సైతం కొండా ఫ్యామిలీకి అదే స్థాయిలో ప్రాధాన్యమిచ్చారు. కానీ క్రమేపి తన మార్కు రాజకీయం చూపింది కొండా ఫ్యామిలీ. రాజకీయ బలోపేతం కోసం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించారు రేవంత్. అక్కడ నుంచి కొండా ఫ్యామిలీలో దిగులు ప్రారంభం అయింది. పరకాల అనేది ఆ ఫ్యామిలీకి గతంలో పెట్టని కోటగా ఉండేది. ఆ నియోజకవర్గ నుంచి రాజకీయం చేయాలని చూశారు సురేఖ కుమార్తె సుస్మిత పటేల్. రేవూరి ప్రకాశ్ రెడ్డి రాకను తీవ్రంగా వ్యతిరేకించారు. కానీ రాష్ట్రంలో రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా రేవంత్ రెడ్డి ఆయనను ఆహ్వానించారు.

**సొంత సీఎం పై అలా..**

ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి పై విమర్శలు ప్రత్యర్థి చేయవచ్చు. కానీ కాంగ్రెస్ పార్టీలో ఎదగాలని భావిస్తున్న ఒక యువ నాయకురాలు.. అందులోనూ ఒక రాష్ట్ర మంత్రి కుమార్తె చాలా బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంటుంది. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైనే కాదు.. కాంగ్రెస్ నాయకత్వం పైనే విమర్శలు చేశారు. అవినీతి ఆరోపణలు చేశారు. అది కూడా ముఖ్యమంత్రి స్థానికంగా లేని సమయంలోనే. అయితే పరకాల నియోజకవర్గం విషయంలో తలెత్తిన విభేదాలు అయితే కూర్చొని మాట్లాడుకుంటే బాగుండేది. కానీ స్థాయికి మించి.. రాజకీయ అస్థిరత సృష్టించేలా ఆమె వ్యాఖ్యలు సాగాయి. అయితే దానిని కప్పిపుచ్చుకునే క్రమంలో సురేఖ కూడా తప్పటడుగులు వేశారు. కుమార్తె వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదన్నట్టు మాట్లాడుతూ సమస్యను మరింత జఠిలం చేశారు.

### పరిస్థితి చక్కదిద్దే అవకాశం..

కొండా సురేఖకు పరిస్థితిని అదుపులోకి తెచ్చే అవకాశం కలిగింది. మధ్యలో రక్షాబంధన్ పండుగ వచ్చింది. క్యాబినెట్ సంవత్సర మంత్రిగా కొండా సురేఖ రాఖీ కట్టేందుకు సీఎం రేవంత్ ఇంటికి వెళ్లారు.. రేవంత్ కుటుంబ సభ్యులకు కూడా ఆమెను సాదరంగా ఆహ్వానించారు. ఈ క్రమంలో అయిందేదో అయిపోయింది.. క్షమించండి అని కోరుకొని ఉంటే పరిస్థితి చేయి దాటేది కాదు. కానీ కొండా సురేఖ తెగేదాకా లాగుదాం అన్నట్టు చూస్తూ ఉండిపోయారు. జరిగిన దానికి క్షమాపణ కోరుతూ ప్రకటన చేసి ఉంటే పరిస్థితి చక్కబడేది. ఢిల్లీ స్థాయిలో ఎవరెవరో తనకు అండగా నిలబడతారు అని భావించారు. కానీ వారు రేవంత్ నాయకత్వానికి ఎదురెళ్లే పరిస్థితి లేదు. అందుకే సురేఖ పై వేటు పడింది. ఈ సందర్భంగా ఆమె భర్త మురళి మీసం మెలేస్తూ కనిపించారు. ఇంత మూల్యం చెల్లించాక ఇప్పుడు కొండా సురేఖ కుమార్తె బాధపడడం మాత్రం అంతా బాగాలేదు. అది మరీ ఎబ్బెట్టుగా ఉంది.

# క్యాబినెట్ ప్రక్షాళన!

**మూడు ఖాళీలతో పాటు..**

మంత్రివర్గంలో మూడు ఖాళీలను భర్తీ చేయడంతో పాటు శాఖలో మార్పులు, చేర్పులు చేపట్టనున్నారు. టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ను మంత్రివర్గంలోకి తీసుకొనున్నారు. ఆయన రెండేళ్ల పదవీకాలం ఈనెల 15 తో ముగియనుంది. పిసిసి అధ్యక్ష పదవికి మంత్రి పొన్నం ప్రభాకర్ పేరు పరిశీలనలో ఉంది. ఒకవేళ లంబాడ వర్గానికి అవకాశం ఇవ్వాలని భావిస్తే మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ కు అవకాశం దక్కవచ్చు. మరోవైపు స్పీకర్ గడ్డం ప్రసాద్ ను సైతం మంత్రివర్గంలోకి తీసుకుంటారని ప్రచారం నడుస్తోంది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది.

**బీసీ మహిళా కోటాలో..**

కొండా సురేఖ బిసి మహిళా నేత. ఆమె స్థానంలో అదే బీసీ వర్గానికి చెందిన మహిళలకు అవకాశం ఇవ్వాలనుకుంటే.. కచ్చితంగా విజయశాంతి పేరును పరిగణలోకి తీసుకుంటారు. మరో మహిళా నేత నలమాద పద్మావతి రెడ్డి పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. లాంబాడా వర్గానికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని భావిస్తే విప్ రామచంద్రనాయక్, ప్యానల్ స్పీకర్ బాలునాయక్ లో ఒకరికి అవకాశం దక్కొచ్చు. మరోవైపు మంత్రివర్గం నుంచి ఒకరిని తొలగించే అవకాశాలు ఉన్నాయని ప్రచారం ఉంది. మొత్తానికి అయితే ఇప్పటివరకు ఉన్న సమాచారం మేరకు రాములమ్మతో పాటు ప్రొఫెసర్ కోదండరాం మంత్రివర్గంలోకి తీసుకోవడం ఖాయమని తెలుస్తోంది .

# స్థానిక ఎన్నికల బహిష్కరణ!

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలను బహిష్కరిస్తుందా? అందుకు కుంటి సాకులను వెతుక్కుంటుందా? న్యాయస్థానాలను అందుకే ఆశ్రయిస్తోందా? ఏపీ పొలిటికల్ సర్కిల్స్ లో దీనిపైనే ఎక్కువగా చర్చ నడుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు వైసీపీకి అగ్నిపరీక్ష గా మారాయి. ఒక్క స్థానంలో కూడా ఏకగ్రీవానికి ఒప్పుకోనని.. ప్రతి చోటా పోటీ చేయాల్సిందేనంటూ జగన్మోహన్ రెడ్డి పార్టీ శ్రేణులకు తేల్చి చెప్పారు. భారీ ప్రకటనలు జారీ చేశారు. కానీ ఆ పార్టీ కోసం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వ్యూహకర్తలు మాత్రం ఎన్నికల బహిష్కరణ వస్త్రాన్ని సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో పార్టీ బలం పుంజుకోలేదని సంకేతంతోనే ఈ నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

**కేంద్ర బలగాలతో ఎన్నికలు..**

కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు ప్రారంభించింది. రాష్ట్ర ఎన్నికల సంఘం సైతం ఏర్పాట్లలో నిమగ్నం అయింది. కానీ ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే శాంతి భద్రతల పేరుతో వినతుల పర్వానికి తెరలేపింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. స్థానిక సంస్థల ఎన్నికల్లో కేంద్ర బలగాలను మోహరించాలంటూ ఇటీవల రాష్ట్ర ఎన్నికల కమిషన్కు వైసిపి లేఖ రాసింది. ఇదంతా ముందస్తు నాటకంలో భాగమే నన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సీన్ మారింది. ఐదేళ్ల వైసిపి హయాంలో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, కిందిస్థాయి నాయకులు చేపట్టిన వివిధ పనులపై విచారణలు, నిధుల వినియోగంపై ఆరోపణలు చుట్టుముట్టే ప్రమాదం ఉండడంతో చాలామంది ద్వితీయ శ్రేణి నేతలు వ్యూహాత్మకంగా సైలెన్స్ పాటిస్తున్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు చేసిన పనులకు తప్పకుండా అధికార పార్టీ నుంచి ప్రతిఘటన వస్తే తమకు ఇబ్బందులు తప్పవని భావిస్తున్నారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల పట్ల విముఖతగా ఉన్నారు వైసీపీ శ్రేణులు.

### పోటీకి విముఖత..

వైసిపి పిలుపునిచ్చే ఆందోళన కార్యక్రమాలకు హాజరవుతున్న ఆ పార్టీ చోటా నేతలు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని కోరుతుంటే మాత్రం వెనుకడుగు వేస్తున్నారు. గెలుపోటముల సంగతిని పక్కన పెడితే.. ఎన్నికల్లో భారీగా ఆర్థికంగా నష్టపోవాల్సి రావడం ఒక ఎత్తు అయితే.. నేరుగా అధికార పార్టీని ఎదిరిస్తే అవసరమైన స్థానిక చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తుందని భయం కనిపిస్తోంది. ప్రతి స్థానంలో పోటీ చేయాలని జగన్ ఆదేశించారు. కానీ అందుకు సుముఖంగా లేరు చోటా నేతలు. అయితే ఇప్పుడు అభ్యర్థులు దొరకని పరిస్థితి ఎదురైతే అంతకంటే అవమానం మరొకటి ఉండదు. అందుకే అధికార పార్టీ అక్రమాల పేరుతో ఇప్పుడు కుంటి సాకులు వెతుక్కుంటూ బహిష్కరణ వైపు వైసిపి అడుగులు వేస్తోందన్నది ఒక అనుమానం. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# లక్ష్మణ రేఖ దాటితే వేటు!

(మొదటి పేజీ తరువాయి)

అందులో భాగమే మంత్రి పదవి నుంచి కొండా సురేఖ, సీనియర్ నేత చిన్నారెడ్డి పై వేటు. దానికి కొనసాగింపుగా ఆదివారం ఒక్కరోజే ఏడుగురు నేతలకు నోటీసులు జారీ చేసింది క్రమశిక్షణ కమిటీ.

**ఎంతటి పెద్ద నేత అయినా..**

ఎంతటి పెద్ద నేత అయినా దారి తప్పితే.. లక్ష్మణ రేఖ దాటి ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్న సంకేతాలు పంపించింది టిపిసిసి క్రమశిక్షణ కమిటీ. ఈ కఠిన వైఖరి వెనుక అసలు వ్యూహం.. పార్టీ యంత్రాంగాన్ని, శ్రేణులను ఒకే తాటిపైకి తెచ్చి గాడిలో పెట్టడమే. ప్రభుత్వం ఒక వైపు సంక్షేమం, అభివృద్ధి అజెండాతో ముందుకు వెళ్తుంటే... సొంత పార్టీ నేతలు బహిరంగ విమర్శలతో మైండ్ గేమ్స్ ఆడుతున్నారు. దీంతో పార్టీ ఇమేజ్ దెబ్బతింటుందని అధిష్టానం భావించింది. అందుకే చర్యలు చేపట్టి.. రాబోయే రోజుల్లో ఎవరు అధిష్టానానికి వ్యతిరేకంగా మాట్లాడకుండా ఒక బలమైన వార్నింగ్ పంపింది.

**వ్యతిరేకంగా మాట్లాడితే అంతే..**

సాధారణంగా కాంగ్రెస్ అంటేనే గ్రూపుల గోల.. అంతర్గత ప్రజాస్వామ్యంతో చేసే వ్యాఖ్యలు కనిపిస్తుంటాయి. తెలంగాణ కాంగ్రెస్ లో ఇటువంటి వాటికి చోటు కల్పించకూడదు అనేది క్రమశిక్షణ కమిటీ భావన. కాంగ్రెస్ మార్కు గ్రూప్ గొడవలు, బహిరంగ వ్యాఖ్యల సంస్కృతికి స్వస్తి పలికి.. కఠిన క్రమశిక్షణతో పార్టీని నడపడమే సీఎం రేవంత్ రెడ్డి, టిపిసిసి నాయకత్వాల ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. పదవులు అనుభవిస్తూ పార్టీ నష్టపోయేలా మాట్లాడితే ఎంతటి వారైనా బయటకు వెళ్లాల్సిందే నన్న సంకేతాలు ఇస్తూ.. మిగతా నాయకులను నోరెత్తకుండా సైలెంట్ చేయడమే ఈ కఠిన చర్యలకు అసలైన అర్థం అని స్పష్టమవుతోంది.

# మెక్సికోలోని ఘోర ప్రమాదం

**ఓ మతపరమైన వేడుకలో పేలుడు**

**10 మంది మృతి, 64 మందికి గాయాలు**

న్యూఢిల్లీ: మెక్సికోలోని ఓ మతపరమైన వేడుకలో ఘోర ప్రమాదం జరిగింది. పటాకుల సామగ్రి భారీగా పేలడంతో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 64 మంది గాయపడ్డారు. పేలుడు ధాటికి ఓ గోడ కూడా కూలిపోయింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందా అన్న దానిపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు. ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. మెక్సికోలోని టెమాస్కాల్సింగో పట్టణంలో ఆ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికంగా నిర్వహిస్తున్న ఓ మతపరమైన వేడుకలో భాగంగా బాణసంచా ప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని నుఎస్ట్రా సెనరో డి లా లూజ్ చర్చి సమీపంలో ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. మతపరమైన వేడుక కావడంతో కార్యక్రమాన్ని చూసేందుకు వందలాది మంది అక్కడికి చేరుకున్నారు. పటాకుల ప్రదర్శన ప్రారంభం కావడానికి సిద్ధమవుతున్న సమయంలో పేలుడు సంభవించడంతో ఒక్కసారిగా అక్కడ భయానక వాతావరణం నెలకొంది.

# అసెంబ్లీ బహిష్కరణ!



అనుసరించిన తీరుపై ఆ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల కఠినంగా వ్యవహరించడం, తోపులాటలో పలువురు నేతలకు గాయాలు కావడం, అసెంబ్లీ గేటు వద్ద అరెస్టులు చేసి తెలంగాణ భవన్ కు తరలించడంపై తీవ్ర నిరసన వ్యక్తం అవుతోంది. ప్రతిపక్షం గొంతు నొక్కిందుకే కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసు బలగాలను ఆయుధంగా వాడుకుంటుందని విమర్శిస్తూ.. అన్ని జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనానికి, నిరసన ర్యాలీలకు పార్టీ పిలుపునిచ్చింది. ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలిపే హక్కును హరించడంపై న్యాయస్థానాలను కూడా ఆశ్రయించే ఆలోచనలో ఆ పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది.

**ప్రజల్లోకి వెళ్లేందుకు నిర్ణయం..**

భారత రాష్ట్ర సమితి అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తుంది అని ప్రచారం జరుగుతోంది. ప్రజాప్రతినిధులను సభలోకి రాకుండా పోలీసులతో ప్రభుత్వమే అడ్డుకుందని ఆరోపిస్తూ ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయం తీసుకుంది. సభలో తమకు మైక్ ఇవ్వకపోవడం, మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకుండా రాజ్యాంగబద్ధంగా నిరసన తెలిపే ప్రతిపక్ష హక్కును కాలరాయడంపై గులాబీ పార్టీ ఆగ్రహం నేతలు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ప్రతిపక్ష హోదాను పక్కనపెట్టి ప్రభుత్వం చేస్తున్న ఏకపక్ష వైఖరికి నిరసనగా సభను పూర్తిగా బహిష్కరించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే అధికార కాంగ్రెస్ మాత్రం భారత రాష్ట్ర సమితి నాటకాలు ఆడుతోందని తిప్పికొడుతోంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడమే కాదు పోలీసులతో అనుచితంగా ప్రవర్తించారని.. రాజకీయ లబ్ధి కోసమే ఇటువంటి డ్రామాలు ఆడుతున్నారంటూ ఆరోపిస్తోంది.

# దసరాకు కొత్త పార్టీ!



అదే విషయంపై స్పష్టతనిచ్చారు. సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన విజయసాయిరెడ్డి తన రాజకీయ భవిష్యత్ కార్యాచరణ వెల్లడించారు. దసరాకు కొత్త రాజకీయ పార్టీని ప్రకటిస్తానని తెలిపారు. ఏపీలోనే తన పార్టీ ఉంటుందని స్పష్టం చేశారు. వైసిపి, టిడిపిలకు ప్రత్యామ్నాయంగా పార్టీని ఏర్పాటు చేస్తున్నాను అని.. ఆ రెండు పార్టీలు తనకు శత్రువులు కాదని.. కేవలం రాజకీయ ప్రత్యర్థులు మాత్రమేనని స్పష్టం చేశారు.

**సీఎం అభ్యర్థి పై స్పష్టత..**

మరోవైపు తన పార్టీ తరపున ముఖ్యమంత్రి అభ్యర్థి విషయంలో కూడా స్పష్టత ఇచ్చారు. తన పార్టీ తరఫున సీఎం అభ్యర్థిగా తాను ఉండడం లేదని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో కేవలం రెడ్లు, కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు మాత్రమే సీఎం కావాలా అని ప్రశ్నించారు. తన పార్టీలో ఎవరికి సామర్థ్యం ఉంటుందో వారే సీఎం అభ్యర్థి అవుతారని.. తాను వెనుక ఉండి నడిపిస్తానని స్పష్టం చేశారు. కొత్తగా స్థాపించే పార్టీలో తనది బాల్ థాకరే వంటి మెంటర్ పాత్ర మాత్రమేనని తేల్చి చెప్పారు. తనతో పాటు తన కుటుంబ సభ్యులకు కూడా పదవుల్లో ఉండాలని అన్నారు. ఏపీలో గత 15 సంవత్సరాలుగా టిడిపి, వైసిపి చుట్టూనే రాజకీయం తిరుగుతోందని.. ఈ రెండు పార్టీల మధ్య ప్రజలు నలిగిపోతున్నారని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేసేందుకు ఒక కొత్త పార్టీ అవసరం అని అభిప్రాయపడ్డారు.

**అమరావతి పై కీలక వ్యాఖ్యలు..**

అమరావతి పై కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. తాను అమరావతికి వ్యతిరేకం కాదని.. ఇష్టం ఉన్నా.. లేకపోయినా అమరావతికి మద్దతు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. అమరావతి అభివృద్ధి కోసం ప్రైవేటు వ్యక్తులను ఆహ్వానించాలని.. ప్రభుత్వ సొమ్మును వృధా చేయకూడదని సూచించారు. ఇక పార్టీలో 66% పదవులు యువతకి కేటాయిస్తామని విజయసాయిరెడ్డి చెప్పుకొచ్చారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే పెట్రోలియం పై జిఎస్టి 15 శాతానికి తగ్గిస్తామని హామీ ఇచ్చారు. అలాగే డీఎస్సీ, ఏపీపీఎస్సీ లపై వస్తున్న ఆరోపణలకు సంబంధించిన అనుమానాలు నివృత్తి కావాలంటే ఈ కేసులను సిబిఐ కు అప్పగించాలని విజయసాయిరెడ్డి డిమాండ్ చేశారు. అయితే పదే పదే పార్టీ ప్రకటన ఉంటుందని చెప్పుకొస్తున్న విజయసాయిరెడ్డి.. పార్టీ ప్రకటనను వాయిదా వేస్తుండడం మాత్రం హాట్ టాపిక్ అవుతోంది.

# తాతా మధును డిస్మిస్ చేయాలి..

(మొదటి పేజీ తరువాయి)

లేదంటే పార్టీ నుంచి తొలగించాలని బీఆర్ఎస్ నాయకత్వాన్ని కోరారు. సోమవారం సభలో ఈ అంశాన్ని ప్రస్తావించిన ముఖ్యమంత్రి.. స్పీకర్ స్థానానికి ఉన్న గౌరవాన్ని కాపాడటం సభలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. శాసనసభ్యుల హక్కుల పరిరక్షణలో కీలకంగా వ్యవహరించే సభాపతిని అవమానించే విధంగా వ్యాఖ్యలు చేయడం తీవ్రమైన విషయమని అన్నారు. ఇలాంటి సందర్భంలో పార్టీలకు అతీతంగా అందరూ స్పందించాల్సిన అవసరం ఉందని సూచించారు. తాతా మధు చేసిన వ్యాఖ్యల వెనుక కేసీఆర్ ప్రోత్సాహం ఉందని సీఎం ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్న తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన.. ఈఘటన తెలంగాణ సమాజం ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని వ్యాఖ్యానించారు. దళిత వర్గానికి చెందిన వ్యక్తి సభాపతి స్థానంలో ఉండటాన్ని అవమానించడం ద్వారా దళితులను, గిరిజనులను మాత్రమే కాకుండా మొత్తం సమాజాన్ని అవమానించినట్లవుతుందని అన్నారు. గతంలో దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని, దళిత కుటుంబాలకు మూడెకరాల భూమి అందిస్తామని హామీ ఇచ్చి కేసీఆర్ వాటిని అమలు చేయలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. దళిత ఉపముఖ్యమంత్రిని పదవి నుంచి తప్పించిన ఘనత కూడా కేసీఆర్‌దేనని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం దళితుడైన వ్యక్తి ప్రతిపక్ష నేతగా ఉండటాన్ని కూడా బీఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతోందని ఆరోపించారు. ఇదిలా ఉండగా.. సభలో బీజేపీ ప్రస్తావించిన అంశాలపైనా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ముందుగా చర్చ జరిగి, అనంతరం నిర్ణయాలు వెలువడతాయని పేర్కొన్నారు. అన్ని అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అయితే సభాపతి స్థానాన్ని అవమానించే వ్యాఖ్యలపై బీజేపీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. 22ఏ అంశాన్ని కూడా రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. దీనిపై ఇప్పటికే మంత్రి క్షమాపణ చెప్పిన విషయాన్ని ఆయన పేర్కొన్నారు. ధరణి వ్యవహారంపైనా చర్చకు సిద్ధమని చెబుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో చేసిన తప్పిదాలపై ప్రశ్నలు ఉన్నాయని అన్నారు. సభలో జరుగుతున్న చర్చను పక్కదారి పట్టించేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ఈ మొత్తం పరిణామాలపై కేసీఆర్ వెంటనే క్షమాపణ చెప్పాలని మరోసారి డిమాండ్ చేసిన సీఎం.. తాతా మధు వ్యవహారంలో బీఆర్ఎస్ నాయకత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్సీతో రాజీనామా చేయించడమో, పార్టీ నుంచి తొలగించడమో చేయాలని రేవంత్‌రెడ్డి అన్నారు.

# సభకు కెసిఆర్!

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న కేసీఆర్ ప్రతిపక్ష నేతగా మారిపోయారు. కానీ ఆయన సభకు వెళ్లడం లేదు. ఎందుకు వెళ్లడం లేదో చెప్పడం లేదు. అందుకే సభకు రాని కెసిఆర్ రాజీనామా చేయాలి అంటూ డిమాండ్ చేస్తోంది అధికార కాంగ్రెస్. వరుసగా ధర్నాలు, ఆందోళనలు చేపడుతోంది. పోనీ బిఆర్ఎస్ఎల్పి సమావేశంలోనైనా స్పష్టతనిస్తారని అంతా భావించారు. కానీ అక్కడ కూడా తాను సభకు ఎందుకు హాజరు కావడం లేదో వివరించే ప్రయత్నం చేయలేదు. పాదయాత్ర చేస్తానని చెప్పుకొచ్చిన ఆయన.. అసెంబ్లీకి హాజరు విషయంలో మాత్రం స్పష్టత ఇవ్వలేదు.

**అడ్డంకిగా రాజకీయ స్థాయి**

కెసిఆర్ సభకు హాజరు విషయంలో ఒక్కటి మాత్రం స్పష్టం. ఆయన రాజకీయ స్థాయి చూసుకుంటున్నారు. దశాబ్ద కాలం పాటు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని ఏకచత్రాధిపత్యంగా ఏలిన తనకు, తాను తేలికగా తీసిపారేసిన రేవంత్ రెడ్డి సభా నాయకుడి హోదాలో బెంచి పై కూర్చోవడం కేసీఆర్ మనస్తత్వానికి అంగీకరించడం లేదనేది బహిరంగ రహస్యం. తనకంటే వయసులో, రాజకీయ అనుభవంలో చిన్నవాడైన రేవంత్ ముందు భాను ప్రతిపక్ష నేతగా మైక్ కోసం నిలబడటాన్ని తన స్థాయికి తక్కువగా ఆయన భావిస్తున్నారు. అయితే ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ స్థాయిలు అనేవి స్వయంకృతాపరాదాలు కావు. ప్రజలు తీర్పు ద్వారా కట్టబెట్టే పదవులు మాత్రమే అనే కనీస సత్యాన్ని కేసీఆర్ విస్మరిస్తున్నారు.

**ఆ భయంతోనే..**

సభకు వెళ్తే అధికార పార్టీ నుంచి వ్యక్తిగత దాడి ఉంటుందనేది కేసీఆర్ కు ఉండే భయం. కానీ కెసిఆర్ చుట్టూ రక్షణ కవచంలా కేటీఆర్ తో పాటు హరీష్ రావు ఉంటారు. పోనీ అధికార పార్టీ అవమానిస్తే అది రాజకీయంగా సానుభూతి తెచ్చి పెడుతుంది. అటువంటి సానుభూతి రాజకీయాలు కేసిఆర్ కు కొత్త కాదు. పక్క రాష్ట్రంలో జగన్ తనకు ప్రతిపక్ష నేత హోదా రాలేదని చెప్పి అసెంబ్లీకి రావడం లేదు. కానీ కెసిఆర్ కు ఆ సమస్య లేదు. ఎందుకంటే ఆయన ప్రతిపక్ష నేతతో హోదా పొందుతున్నారు. క్యాబినెట్ హోదా తో పాటు సదుపాయాలు కూడా వినియోగించుకుంటున్నారు. ఇన్ని అనుకూలతలు ఉండి కూడా కెసిఆర్ సభకు హాజరు కాకపోవడం అనేది లోటుగానే పరిగణించాలి.

**గులాబీ పార్టీది అదే మాట..**

కెసిఆర్ సభకు హాజరైతే రేవంత్ తట్టుకోలేరు అనేది గులాబీ పార్టీ మాట. కానీ అది కేవలం పార్టీ క్యాడర్లో ధైర్యం నింపేందుకే అన్నది బహిరంగ రహస్యం. కచ్చితంగా రేవంత్ అటాక్ చేస్తారు. దానిని కేసీఆర్ తట్టుకోలేరు. అయితే రాజకీయాల్లో ఎవరి శైలి వారిదే.



ఎవరి ప్రత్యేకత వారిదే. రేవంత్ ప్రతిపక్ష నాయకుడిగా ఏ స్థాయిలో దూకుడు కనబరిచారో తెలియనిది కాదు. కానీ ఇప్పుడు కెసిఆర్ అధికారిక ప్రతిపక్ష నాయకుడు. గొప్ప అవకాశం కూడా ఆయనకు. అయితే ఇప్పటికే వర్కింగ్ ప్రెసిడెంట్ గా కేటీఆర్ ఉన్నారు గులాబీ పార్టీకి. సభకు హాజరు కావడం అనేది ఇబ్బందిలా ఉంటే కెసిఆర్ కేటీఆర్ కు ప్రతిపక్ష నాయకుడి బాధ్యత అప్పగించి ఉంటే బాగుండేది. కెసిఆర్ అనుసరిస్తున్న సైలెంట్ బాయ్ కాట్ వ్యూహం కాంగ్రెస్ పార్టీకి అస్త్రంగా మారుతోంది.

# అభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తున్నారు

### ఉపసర్పంచ్ తీరుపై సర్పంచ్ సుజాత ఫిర్యాదు

### ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి.. రాజకీయ కక్షలతో ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపణ

మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, సెప్టెంబరు 7: అవంతిపురం గ్రామపంచాయతీలో ఉపసర్పంచ్ ఉప్పతల మహేష్ వ్యవహరిస్తున్న తీరుతో పాలన, అభివృద్ధి పనులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని సర్పంచ్ వల్దాసు సుజాత ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పంచాయతీ పరిపాలనకు అడ్డంకులు సృష్టిస్తున్న ఉపసర్పంచ్‌పై సమగ్ర విచారణ జరిపి శాఖాపరంగా, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.సర్పంచ్ సుజాత మాట్లాడుతూ.. తాను కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచ్ కావడంతో రాజకీయ విభేదాలను పంచాయతీ పరిపాలనలోకి తీసుకువస్తున్నారని ఆరోపించారు. రాజకీయ, వ్యక్తిగత కక్షలతో తన అధికారిక విధులకు పదేపదే ఆటంకాలు కల్పిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి పనులు, పంచాయతీ ప్రతిపాదనలు, పూర్తయిన పనుల బిల్లులపై సంతకాలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు.

**సమావేశాలకు గైర్హాజరు**


పంచాయతీ సమావేశాలకు ఉద్దేశపూర్వకంగా గైర్హాజరవడంతో పాటు.. ఇతర వార్డు సభ్యులు కూడా



సమావేశాలకు హాజరుకాకుండా అడ్డుకుంటున్నారని సుజాత ఆరోపించారు. దీంతో పంచాయతీ సమావేశాల నిర్వహణకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాల కోసం గ్రామ అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదన్నారు.

**'దళిత మహిళననే వివక్ష'**

దళిత మహిళా సర్పంచ్‌గా ఉన్నందుకే తనపై వివక్ష చూపుతున్నారని సుజాత ఆవేదన వ్యక్తం చేశారు. తన హోదాను తక్కువ చేసి మాట్లాడటం, అవమానకరంగా వ్యవహరించడం, మానసికంగా ఇబ్బందులకు గురిచేయడం జరుగుతోందని ఆరోపించారు. రాజకీయ, వ్యక్తిగత విభేదాలతో పాటు సామాజిక వివక్షను కూడా ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు.పంచాయతీ సమావేశాలు, కార్యక్రమాల్లో సర్పంచ్ హోదాకు తగిన గౌరవం ఇవ్వకుండా వ్యవహరిస్తున్నారని, అధికారిక



విధులను స్వేచ్ఛగా నిర్వహించకుండా ఒత్తిళ్లకు గురిచేస్తున్నారని ఆరోపించారు.గ్రామ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ వ్యవహారంపై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని సుజాత కలెక్టర్‌ను కోరారు. తనపై జరుగుతున్న వివక్ష, వేధింపులపైనా విచారణ జరిపి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. పంచాయతీ పాలన రాజకీయ కక్షలు, వ్యక్తిగత ప్రయోజనాలకు అతీతంగా సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తన అధికారిక విధులను స్వేచ్ఛగా నిర్వహించేందుకు రక్షణ కల్పించడంతో పాటు.. అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తున్న వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## నవంబర్ 30 కల్లా నివేదిక సమర్పించాల్సిందే

### ఆరావళిపై కమిటీకి సుప్రీంకోర్టు గడువు విధింపు

న్యూఢిల్లీ: ఆరావళి పర్వత శ్రేణి పరిధి, నిర్వచనం, పరిరక్షణకు సంబంధించిన తుది నివేదికపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. నివేదిక సమర్పించేందుకు మరో ఆరు నెలల గడువు కావాలని హైపవర్ కమిటీ చేసిన విజ్ఞప్తిని తిరస్కరించింది. నవంబర్ 30లోగా తుది నివేదికను సమర్పించాలని డెడ్‌లైన్ విధించింది. గడువులోగా నివేదిక ఇవ్వడంలో విఫలమైతే మొత్తం కమిటీని రద్దు చేసి కొత్త కమిటీ ఏర్పాటు చేస్తామని హెచ్చరించింది. ఆరావళి పర్వత శ్రేణి నిర్వచనం, దాని పరిధి, పర్యావరణ పరిరక్షణ, ముఖ్యంగా మైనింగ్ కార్యకలాపాల నియంత్రణకు సంబంధించి సుప్రీంకోర్టు కొన్ని నెలల క్రితం కమిటీని ఏర్పాటు చేసింది. ఆరావళి ప్రాంతాన్ని ఏ విధంగా గుర్తించాలి? ఏ ప్రాంతాలను రక్షణ పరిధిలోకి తీసుకురావాలి? మైనింగ్‌పై ఎలాంటి నియంత్రణలు ఉండాలి? అనే అంశాలపై కమిటీ ప్రస్తుతం అధ్యయనం చేస్తోంది. తుది నివేదిక సమర్పించేందుకు కమిటీకి గతంలో ఇచ్చిన గడువు ఆగస్టు 31తో ముగిసింది. అయితే ఆ అంశంపై సమగ్రంగా, భవిష్యత్తులో కూడా సమర్థించగలిగే విధంగా నివేదిక సిద్ధం చేయాలంటే మరింత సమయం అవసరమని కమిటీ పేర్కొంది. అందులో భాగంగా మరో ఆరు నెలల గడువు ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరింది. అంటే వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. అయితే ఆ అభ్యర్థనపై అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చీ, వి. మోహనలతో కూడిన ధర్మాసనం సోమవారం ఆ వ్యవహారాన్ని విచారించింది. కమిటీ కోరిన ఆరు నెలల గడువును ఇవ్వడానికి నిరాకరించింది. ఆరావళి అంశాన్ని మరింత కాలం వాయిదా వేయడం సరికాదని స్పష్టం చేసింది. కమిటీ అవసరమైతే రాత్రింబవళ్లు పనిచేసి నివేదిక సిద్ధం చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. నవంబర్ 30వ తేదీలోగా తుది నివేదికను సమర్పించాలని ఆదేశించారు. రెండు నెలల సమయంలో నివేదిక ఇవ్వలేకపోతే ప్రస్తుత కమిటీని పూర్తిగా రద్దు చేసి కొత్త కమిటీని ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు. ఆరావళి అంశం ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవహారాన్ని ఇకపై పెండింగ్‌లో ఉంచలేమన్న సంకేతాన్ని కోర్టు ఇచ్చింది.

## త్రివిధ దళాల సామర్థ్యం మరింత బలోపేతం

### 1.10 లక్షల కోట్లతో ఆయుధాలు కొనుగోళ్లు

### అత్యాధునిక ఆరుద్ర రాడార్లుకు ప్రాముఖ్యత

### కొనుగోళ్ల ప్రతిపాదనలకు ఆమోదముద్ర

న్యూఢిల్లీ: దేశ త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణశాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఏకంగా 1.10 లక్షల కోట్ల రూపాయల వ్యయంతో ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోళ్లకు పచ్చజెండా ఊపింది. ఈ మేరకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ పలు కీలక ప్రతిపాదనలకు ప్రాథమిక ఆమోదం తెలిపింది. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా ఆమోదం పొందిన ప్రతిపాదనల్లో 98 శాతం దేశీయ రక్షణ రంగ సంస్థల నుంచే కొనుగోళ్లు చేయనున్నట్లు స్పష్టం చేసింది.సాయుధ దళాల ఆధునీకరణే లక్ష్యంగా ఈ ఏడాదిని 'సంస్కరణల సంవత్సరం'గా ప్రకటించిన రక్షణశాఖ త్రివిధ దళాల బలోపేతానికి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎలాంటి పరిస్థితులనైనా దీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా సైన్యానికి అవసరమైన ఆయుధ పరికరాల సేకరణకు పచ్చజెండా ఊపింది. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ ఏకంగా రూ. 1.10 లక్షల కోట్ల విలువైన ఆయుధ సంపత్తి కొనుగోళ్ల ప్రతిపాదనలకు ప్రాథమిక ఆమోదముద్ర వేసింది. డీఏసీ ఆమోదించిన ప్రతిపాదనల్లో భారత సైన్యానికి అవసరమైన కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్, న్యూక్లియర్ రెక్కీ వాహనాలు ఉన్నాయి. ఈ వాహనాలు కలుషితమైన ప్రాంతాలను గుర్తించి, పర్యవేక్షించడంతో పాటు మార్కింగ్ చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయి. అత్యంత క్లిష్టమైన సరిహద్దు భూభాగాల్లో దళాల వేగవంతమైన కదలికలు, లాజిస్టిక్స్, ఆపరేషనల్ సపోర్ట్ కోసం హై మొబిలిటీ వెహికల్స్ కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. శత్రువులకు ముకుతాడు వేసేలా సవాలుతో కూడిన ప్రాంతాల్లో అత్యంత వేగంగా, సమర్థవంతంగా మందుపాతరలను అమర్చేందుకు సెల్ఫ్-ప్రొపెల్డ్ మెకానికల్ మైన్ లేయర్స్ కొనుగోలుకు సైతం ఆమోదముద్ర వేసింది. యుద్ధ సమయాల్లో క్లిష్టమైన భౌగోళిక ప్రాంతాల్లో అత్యంత సంక్లిష్టమైన మిషన్లలో కీలకంగా వ్యవహరించే అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు, ట్రాల్ ట్యాంకులు, సర్వత్ర బ్రిడ్జి సిస్టమ్, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ల కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది.భారత నావికాదళం కోసం 'ఆరుద్ర' రాడార్లతో పాటు మెరైన్ గ్యాస్ టర్బైన్ల రూపకల్పన, అభివృద్ధి, కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. వివిధ నావల్ ఎయిర్ స్టేషన్లలో ప్రస్తుతం ఉన్న ఎయిర్ రూట్ సర్వైలెన్స్ రాడార్ల స్థానంలో ఈ అత్యాధునిక ఆరుద్ర రాడార్లను ప్రవేశపెట్టనున్నారు. యుద్ధనౌకలకు ఇంధన సిస్టమ్‌గా పనిచేసే మెరైన్ గ్యాస్ టర్బైన్ల కొనుగోలుతో ఇంజిన్ల విషయంలో విదేశీ సంస్థలపైన ఆధారపడటం తగ్గుతుందని రక్షణ శాఖ స్పష్టం చేసింది.భారత వాయుసేనకు చెందిన ఫైటర్ జెట్లు, రవాణా విమానాలు, హెలికాప్టర్ల యుద్ధ సామర్థ్యాన్ని పెంచే పలు ప్రతిపాదనలకు సైతం డీఏసీ ఆమోదం తెలిపింది. శత్రుదేశాల నిఘా రాడార్లను సమర్థంగా అడ్డుకునే గ్రౌండ్-బేస్డ్ మల్టీ-పర్పస్ జామర్ల కొనుగోలుకు పచ్చజెండా ఊపింది. రక్షణ వ్యవస్థల భద్రతను డిజిటలైజ్ చేస్తూ 'డిఫెన్స్ ఫోర్సెస్ సెక్యూర్ యాక్సెస్ కార్డ్' వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు డీఏసీ అంగీకారం తెలిపింది. దీని ద్వారా దళాల్లో ఇప్పటివరకు ఉన్న పాత పేపర్ గుర్తింపు కార్డులు, పాస్‌లు, పర్మిట్ల స్థానంలో పరస్పరం పనిచేసే అత్యాధునిక స్మార్ట్ కార్డులను అమలు చేయనున్నారు. ఈ కొనుగోలులో 98 శాతం దేశీయ పరిశ్రమల నుంచే సేకరించనున్నట్లు రక్షణ శాఖ స్పష్టం చేసింది. తద్వారా 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి మరింత ఊతమిస్తుందని వెల్లడించింది.

## విజయవాడ మేయర్‌గా వంగవీటి!

ఈ కార్పొరేషన్ మేయర్ అంటే క్యాబినెట్ మంత్రితో సమానం. పైగా విజయవాడ అంతా పట్టు పెంచుకునేందుకు ఈ పదవి ఎంతగానో దోహదం చేస్తుంది. అందుకే ఆ పదవి కేటాయించాలన్న డిమాండ్ వంగవీటి అభిమానుల్లో పెరుగుతోంది. ఇప్పటికే మేయర్ పదవిపై విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు కుమారుడు సిద్ధార్థ ఆశలు పెట్టుకున్నారు. ఇప్పుడు వంగవీటి రాధాకృష్ణ పేరు తెరపైకి రావడంతో బోండా ఉమామహేశ్వరరావు అనుచరులు నిరాశలోకి వెళ్లిపోయారని ప్రచారం నడుస్తోంది.

**దరఖాస్తు సమర్పణ..**

మొన్ననే సీఎం చంద్రబాబుతో పాటు లోకేష్ ను కలిశారు బోండా ఉమామహేశ్వరరావు. తన కుమారుడు సిద్ధార్థ ను వెంటబెట్టుకొని మేయర్ గా అభ్యర్థిత్వం ఆశిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. తమ దరఖాస్తును సైతం సమర్పించారు. రెండోసారి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన బోండా ఉమామహేశ్వరరావు మంత్రి పదవి ఆశించారు. వివిధ సమీకరణల్లో భాగంగా చంద్రబాబు ఆయనకు అవకాశం ఇవ్వలేకపోయారు. దీంతో మొన్న ఆ మధ్యన తన మనసులోని బాధను బయటపెట్టారు. అటు తరువాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీమంత్రి అంబటి రాంబాబు తో వేదిక పంచుకోవడం వివాదం గా మారింది. చివరకు పార్టీ జారీ చేసిన నోటీసుకు వివరణ ఇవ్వాల్సి వచ్చింది. కానీ తరువాత జరిగిన పరిణామాలతో బోండా ఉమామహేశ్వరరావు కుమారుడుకు మేయర్ పదవి ఇచ్చి ఆయనను సంతృప్తి పరుస్తారన్న ప్రచారం సాగింది. అందుకు తగ్గట్టుగానే ఉమామహేశ్వరరావు తన కుమారుడితో కలిసి సీఎం చంద్రబాబును కలవడంతో ఈ అనుమానాలకు బలం చేకూరింది. కానీ ఇప్పుడు వంగవీటి రాధాకృష్ణ పేరు తెరపైకి రావడంతో మేయర్ పదవికి గట్టి పోటీ ఉన్నట్లు అర్థం అవుతోంది.

**కాంగ్రెస్ ద్వారా ఎంట్రీ..**

కాంగ్రెస్ పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన వంగవీటి రాధాకృష్ణ అనుకున్న స్థాయిలో రాజకీయాల్లో రాణించలేకపోయారు. దానికి కారణం తరచూ పార్టీలు మారడం. 2004లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టారు. 2009 ఎన్నికల నాటికి ప్రజారాజ్యం పార్టీ గూటికి చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తరువాత జగన్ వైసీపీ ఏర్పాటు చేయడంతో ఆ పార్టీలో చేరారు. ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2019లో తనకు నచ్చిన సీటు ఇవ్వలేదని చెప్పి వైసీపీ నుంచి బయటకు వచ్చి టిడిపిలో చేరారు. ఆ పార్టీకి మద్దతుగా ప్రచారం చేశారు. కానీ టిడిపి ఓడిపోయింది. అదే పార్టీలో ఐదేళ్లపాటు కొనసాగిన రాధాకృష్ణ మొన్నటి ఎన్నికల్లో కూటమి తరఫున ప్రచారం చేశారు. కూటమి అధికారంలోకి రావడంతో తప్పకుండా నామినేటెడ్ పదవి దక్కుతుందని భావించారు. ఎమ్మెల్సీ కానీ.. రాజ్యసభ సభ్యత్వం కానీ ఇస్తారని అనుకున్నారు. ఇప్పుడు మేయర్ పదవి పై ఆయన ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. మరి చంద్రబాబు ఎటువైపు మొగ్గు చూపుతారో చూడాలి.

## పటాన్‌చెరు లో హై ఓల్టేజ్.. ఒకే రోజు.. ఒకే వేదిక వైపు..

బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్

ఉదయం 10 గంటలకు అంబేద్కర్ విగ్రహం వద్ద రాజకీయ వేడి

బీఆర్ఎస్ ర్యాలీకి గూడెం మహిపాల్‌రెడ్డి నేతృత్వం..

కాంగ్రెస్ నిరసనకు కాటా శ్రీనివాస్‌గౌడ్ పిలుపు

రెండు పార్టీలకు వేర్వేరు అంశాలు.. టార్గెట్ మాత్రం రాజకీయ ప్రత్యర్థులే!

అంబేద్కర్ విగ్రహం వద్ద ఎవరి బలమెంతో?

నిరసనలతో పటాన్‌చెరులో హీట్ పెంచనున్న రెండు పార్టీలు

ఒకే సమయం.. ఒకే ప్రాంతం.. పటాన్‌చెరులో పొలిటికల్ ఫైట్!



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 07: పటాన్‌చెరు నియోజకవర్గంలో మంగళవారం రాజకీయ వేడి నెలకొననుంది. ఒకే రోజు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు వేర్వేరు అంశాలపై నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చాయి. దీంతో పటాన్‌చెరు పట్టణంలో రాజకీయంగా ఆసక్తికర పరిస్థితి ఏర్పడింది. శాసనసభ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు మైత్రి మైదానం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నేతృత్వంలో ఈ కార్యక్రమం జరగనుంది. మరోవైపు, దళిత స్పీకర్‌ను అవమానించేలా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసినట్లు ఆరోపిస్తున్న వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ కూడా మంగళవారం ఉదయం 10 గంటలకు అంబేద్కర్ విగ్రహం వద్ద భారీ నిరసన కార్యక్రమం చేపట్టనుంది. పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు నిర్వహించే ఈ కార్యక్రమానికి అమీన్పూర్, బీరంగూడ డివిజన్లకు చెందిన నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారు.ఇరుపార్టీలు వేర్వేరు అంశాలపై ఒకే సమయంలో కార్యక్రమాలు నిర్వహించనుండటంతో పటాన్‌చెరు అంబేద్కర్ విగ్రహం వద్ద రాజకీయ సందడి నెలకొననుంది. ఇరుపార్టీల బలప్రదర్శనపై స్థానికంగా ఆసక్తి నెలకొంది.


# కూతురి రాజకీయ భవితవ్యం కోసమే!

**నేడు రాష్ట్ర రాజకీయాలు కొండా ఫ్యామిలీ చుట్టూ తిరుగుతున్నాయి. ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటారో.. అధిష్టానం ఎటువైపుగా అడుగులు వేస్తుందో అని ఉత్కంటగా ఎదురు చూస్తున్నారు. కానీ కొండా దంపతులు తమ సుదీర్ఘ రాజకీయ అనుభవం, బీసీ వర్గాల్లోని బలం, ప్రజా మద్దతును ఉపయోగించి కూతురికి స్వతంత్ర రాజకీయ వేదికను సిద్ధం చేయాలని భావిస్తున్నట్టుగా కూడా చర్చ జరుగుతోంది. కొత్త వేదిక ద్వారా ఆమెకు అవకాశం కల్పించాలనే ఆలోచన ఉందని వారి సన్నిహితులు చెబుతున్నారు. బీసీల ఆత్మగౌరవం, ప్రాతినిధ్యం అజెండాగా కొత్త రాజకీయ శక్తిని నిర్మించే ప్రయత్నం కూడా ఈ కోణంలోనే చూడవచ్చు. తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం కొండా సురేఖ రాజీనామా వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది.**

కొండా సురేఖ మంత్రి పదవికి రాజీనామా చెయ్యాలని, లేదంటే పార్టీ నుండి బర్తరఫ్ చేస్తామని పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీ చేయటంతో కొండా కపుల్ రాజకీయ భవితవ్యం గందరగోళంలో పడింది. కూతురు చేసిన వ్యాఖ్యలు కొండా సురేఖ రాజకీయ జీవితాన్ని మార్చేస్తుంది అన్న చర్చ స్థానికంగా జోరుగా సాగుతోంది. చాలా కాలంగా కొండా కపుల్ తమ కుమార్తె పొలిటికల్ ఎంట్రీ కోసం ప్రయత్నం చేస్తున్నారు. గతంలోనూ బీఆర్ఎస్ లో ఉన్న సమయంలో కూడా కొండా సుస్మితకు టికెట్ కావాలని అధిష్టానం మీద ఒత్తిడి తెచ్చారు. కొండా సుస్మిత తన తల్లిదండ్రుల రాజకీయ వారసత్వాన్ని కొనసాగించాలనే ఆలోచనతో పరకాల నియోజకవర్గంపై గంపెడు ఆశలు పెట్టుకుంది. అయితే ఇటీవల సీఎం రేవంత్ పరకాలలో మళ్ళీ టికెట్ రేవూరి ప్రకాష్ రెడ్డికే అని ప్రకటన చేయటంతో సుస్మిత ఆశలమీద నీళ్ళు చల్లినట్టు అయ్యింది. దీంతో పొలిటికల్ ఫ్యూచర్ పైన ఆందోళనలో ఉన్న కొండా సుస్మిత సీఎం రేవంత్ రెడ్డిని తీవ్రస్థాయిలో టార్గెట్ చేశారు. సీఎంపై సుస్మిత చేసిన విమర్శలు పార్టీలో తీవ్ర అలజడి సృష్టించాయి. దీనితో కొండా సురేఖపై షోకాజ్ నోటీసు, పదవి నుంచి తొలగించాలనే డిమాండ్‌లు వచ్చాయి. అయితే కొండా దంపతులు తమ కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తాము బాధ్యులు కాదని, ఆమె స్వతంత్ర వ్యక్తి అని స్పష్టం చేశారు. వారు కొండా సుస్మిత వ్యాఖ్యలను ఖండించి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. కానీ కొండా సుస్మిత వ్యాఖ్యలను ఖండించలేదు. ఒకవేళ అదే చేస్తే కూతురికి రాజకీయంగా అనవసరపు ఇబ్బంది వస్తుందని, కూతురి కోసం పోరాటమే చెయ్యాలని నిర్ణయం తీసుకున్నారు. కొండా దంపతులు తమ సుదీర్ఘ రాజకీయ అనుభవం, బీసీ వర్గాల్లోని బలం, ప్రజా మద్దతును ఉపయోగించి కూతురికి స్వతంత్ర రాజకీయ వేదికను సిద్ధం చేయాలని భావిస్తున్నట్టుగా కూడా చర్చ జరుగుతోంది. కొత్త వేదిక ద్వారా ఆమెకు అవకాశం కల్పించాలనే ఆలోచన ఉందని వారి సన్నిహితులు చెబుతున్నారు. బీసీల ఆత్మగౌరవం, ప్రాతినిధ్యం అజెండాగా కొత్త రాజకీయ శక్తిని నిర్మించే ప్రయత్నం కూడా ఈ కోణంలోనే చూడవచ్చు. తల్లిదండ్రులు తమ బిడ్డ రాజకీయ భవిష్యత్తు కోసం తమ పదవి, పార్టీలోని స్థానం, దశాబ్దాలుగా నిర్మించుకున్న రాజకీయ జీవితాన్ని రిస్క్ చేయటం మామూలు విషయం కాదు. కానీ కొండా దంపతులు ఈ రిస్క్ చేశారు. ఏదేమైనా ఏదో ఒక రచ్చతో నిత్యం ప్రజల మధ్యన హాట్ టాపిక్ గా నిలుస్తూ కొత్త రకం ప్రచారానికి తెర తీస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు ఊపందుకుంటున్నాయి. మంత్రివర్గం నుండి కొండా సురేఖకు ఉద్వాసన పలుకుతున్న క్రమంలో కొండా దంపతుల రాజకీయ భవితవ్యంపైన చర్చ జరుగుతోంది. మొదట నుండి వివాదాస్పదులే అయినప్పటికీ సుదీర్ఘ రాజకీయ అనుభవం, బలమైన కేడర్, వరంగల్ లో బలమైన పట్టు, ఉన్న మంత్రి కొండా సురేఖ, కొండా మురళీ దంపతులు నూతన రాజకీయ శక్తిగా ఆవిర్భవించేందుకు సమాయత్తమవుతున్నారనే వార్తలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం అవుతున్నాయి. బీసీ వర్గాల హక్కులు, ఆత్మగౌరవమే ప్రధాన అజెండాగా వారు ఈ నిర్ణయం తీసుకోబోతున్నారని వారి అనుచరులు, శ్రేయోభిలాషులు చెబుతున్నారు. రాష్ట్ర జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీ సామాజిక వర్గాల ఆత్మగౌరవ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా వారు వ్యూహ రచన చేస్తున్నారని సమాచారం. 40 ఏళ్ల రాజకీయ అనుభవం, పుష్కలమైన ప్రజా మద్దతు, అంగబలం, ఆర్థిక బలం తమకు అనుకూలంగా ఉన్నాయని కొండా దంపతులు భావిస్తున్నారు.ప్రస్తుతం బీసీ మేధావులు, శ్రేయోభిలాషులు, మద్దతుదారులతో విస్తృత స్థాయిలో సమాలోచనలు కొనసాగుతున్నాయి. కొండా దంపతుల నిర్ణయం బీసీల ఏకీకరణకు ఇది మంచి అవకాశం అని వారి మద్దతుదారులు భావిస్తున్నారు. రాష్ట్రంలో మెజారిటీ జనాభా ఉన్న బీసీ వర్గాలను ఒకే వేదికపైకి తెచ్చి, వారికి తగిన రాజకీయ ప్రాధాన్యం కల్పించేందుకు ఈ చర్య దోహదపడుతుందని అంటున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలలో టికెట్లు దక్కక నిరాశలో ఉన్న సమర్థులైన నాయకులకు అవకాశం కల్పించి, వారిని గెలిపించుకునే వ్యూహంతో ముందుకు వెళ్లాలని భావిస్తున్నట్టు సమాచారం. కోదండరామ్, కవిత, తీన్మార్ మల్లన్న వంటి నాయకులు స్వంత వేదికల ద్వారా గుర్తింపు పొందినట్లే, దశాబ్దాలుగా ప్రజాదరణ ఉన్న తాము కూడా స్వతంత్రంగా ముందుకు రావాలనే ఆలోచన కొండా దంపతుల్లో ఉందని వారి సన్నిహితులు చెబుతున్నారు. ప్రకటన అనంతరం నేరుగా ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలు తెలుసుకునేందుకు రాష్ట్రవ్యాప్త పాదయాత్రకు కూడా ప్రణాళికలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మరి కొండా దంపతులు కొత్త రాజకీయ పార్టీ పెడితే వారి వెంట నడిచేవారు ఎందరు? వారు ఈ ప్రయత్నంలో సక్సెస్ అవుతారా అన్న చర్చ కూడా సాగుతుంది. అయితే, దీనిపై కొండా కుటుంబం నుండి అధికారిక ప్రకటన ఇంకా రాలేదు.

# ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు?

**నిద్రపోతే కలలు వస్తాయి, మేలుకుంటే చింతలు వస్తాయి. మరి మనిషి ఏ క్షణంలో నిజంగా జీవిస్తున్నాడు? ఈ ప్రశ్న వినడానికి ఒక తాత్విక చిక్కుముడిలా అనిపించవచ్చు కానీ, ఇది ప్రతి ఒక్కరి గుండె లోతుల్లో ప్రతిధ్వనించే అస్తిత్వ వేదన. ఒక క్షణం ఆగి చుట్టూ చూడండి. మీరు చదివే ఈ అక్షరాలను చూస్తూనే మీ మనసు ఏ తీరాలకు పరుగెత్తుతోంది?**



రేపటి డెడ్‌లైన్ల గురించో, నిన్నటి చేదు జ్ఞాపకాల గురించో, లేక వచ్చే నెల ఇంటి అద్దె గురించో మనసు అనే మదగజం ఒక్క చోట స్థిరంగా ఉండదు. ఇది కేవలం మీ వ్యక్తిగత అలజడి కాదు, ఆధునిక మానవ నాగరికతకు పట్టిన ఒక వింత పలాయనవాద వ్యాధి. సాధారణంగా పరారీ అనే పదం వినగానే చట్టానికి దొరకకుండా తప్పించుకునే నేరస్తులో, లేదా బాకీలు తీర్చలేక ఊరు వదిలి వెళ్ళేవాళ్లో గుర్తొస్తారు. కానీ, మన చుట్టూ ఉన్న కోట్లాది మంది ప్రతిరోజూ ఒక పరారీలోనే ఉన్నారు. అది బయటి వ్యక్తుల నుండి కాదు, తమలోని నిజమైన తాను నుండి. అంతరాత్మ వినిపించే సత్యాలను భరించలేక, ప్రస్తుత క్షణం ఇచ్చే నిశ్శబ్దాన్ని తట్టుకోలేక, మనిషి గతంలోకో లేక ఊహల భవిష్యత్తులోకో పలాయనం చిత్తగిస్తున్నాడు. మనసు ఒక రకమైన ఎగ్జిట్ రూట్ వెతుక్కుంటూనే ఉంటుంది. ఎందుకంటే, ఆగి ఆలోచించడం అంటే లోపల గూడుకట్టుకున్న చేదు నిజాలను ఎదుర్కోవడమే. చీకటి పడ్డాక మంచం మీద వాలగానే నిద్ర ఎందుకు రాదంటే, ఆ నిశ్శబ్దంలో మనసు తన అసలు స్వరంతో మాట్లాడటం మొదలుపెడుతుంది. పగలు పనుల హడావిడిలో నొక్కేసిన ప్రశ్నలు అప్పుడు పడగ విప్పుతాయి. ఆ మాటలు వినడానికి ధైర్యం లేక, వెంటనే స్మార్ట్‌ఫోన్ వెలుగులోకి తలదూరుస్తాం. సోషల్ మీడియా స్క్రీన్ స్క్రోల్ చేస్తూ ఆ నిశ్శబ్దాన్ని ఖతం చేస్తాం. ఈ డిజిటల్ పరారీ అత్యంత ప్రమాదకరమైన మత్తుగా మారిపోయింది. మనిషి తన గదిలో ఒంటరిగా, ప్రశాంతంగా కూర్చోలేకపోవడం వల్లే లోకంలో సగం కష్టాలు పుడుతున్నాయని పాస్కల్ అందుకే అన్నాడు. మనం భోజనం చేస్తున్నప్పుడు ఆ రుచిని ఆస్వాదించం, బదులుగా ఆఫీసు మీటింగ్ గురించి ఆందోళన చెందుతాం. పిల్లలతో ఆడుకుంటున్నప్పుడు మన చేతులు వాళ్ళను స్పృశిస్తున్నా, మనసు మాత్రం క్రెడిట్ కార్డు బిల్లుల చుట్టూ తిరుగుతుంటుంది. ఇప్పుడు అనే అమూల్యమైన క్షణాన్ని బలి ఇచ్చి, ఎప్పుడో జరిగిపోయిన అప్పుడు లో లేదా రాబోయే ఆందోళనల్లో గడుపుతున్నాం. భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పినట్లు మన అధికారం, మన జీవం కేవలం ఈ క్షణంలోనే ఉన్నాయి. కానీ ఆ పాఠాన్ని మనం పుస్తకాల్లోనే వదిలేశాం.

కొందరు బాధ్యతల ముసుగులో పారిపోతుంటారు. ఇంట్లో కుటుంబంతో గడపడం, వాళ్ళ భావోద్వేగాలను పంచుకోవడం కష్టమనిపించినప్పుడు పని ఒత్తిడి పేరుతో తప్పించుకోవడం ఒక రకమైన పలాయనం. సమాజం కూడా బాధను తొక్కిపెట్టమని నేర్పుతోంది కానీ, అణచిపెట్టిన బాధ చనిపోదు, లోపల విషమై పేరుకుపోయి బయటపడుతుంది. చివరికి ఎదుటి వ్యక్తికి దగ్గరైతే మన బలహీనతలు తెలిసిపోతాయేమోననే భయంతో ప్రేమ నుండి కూడా పారిపోతున్నాం. చాలా వైవాహిక బంధాల్లో ఒకే మంచం మీద పడుకున్నా, ఇద్దరూ తమ తమ మనసులనే దీవుల్లో విడివిడిగా బతుకుతున్నారు. రీల్స్, ఆన్‌లైన్ గేమింగ్ వంటి వేల మార్గాలు ఈ రోజు మనల్ని వాస్తవం నుండి వేరు చేస్తున్నాయి. ఆ స్క్రీన్ ఆఫ్ చేయగానే నిశీధి మళ్ళీ మనల్ని ఆవహిస్తుంది. ఈ నిరంతర పరారీకి చరమగీతం పాడాలంటే రోజులో కనీసం పది నిమిషాలు ఏ ఫోను లేకుండా ప్రశాంతంగా కూర్చోవాలి. మీ మనసు చెప్పే ఏడుపులు, పెడబొబ్బలు అన్నీ వినాలి. తాగే టీ కప్పు వేడిని స్పృశిస్తూ, పక్కన ఉన్న మనిషి మాటలను మనసు పెట్టి వింటూ ప్రతి చిన్న పనిని ధ్యానంలా చేయాలి. వర్తమానంలో బతకడం నేర్చుకుంటే గతం భారం కాదు, భవిష్యత్తు భయం కాదు. పారిపోయే మనిషి ఎప్పుడూ అలసటను మూటగట్టుకుంటాడు తప్ప గమ్యాన్ని చేరుకోలేడు. మీ అంతరంగాన్ని మీరు కలుసుకుని, నిలబడే ధైర్యం చేసినప్పుడే మీ నిజమైన జీవితం ప్రారంభమవుతుంది.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# సరికొత్తగా హస్త కళలు

**ఆధునిక డిజైన్లతో సంస్కృతీ సంప్రదాయల కళారూపాలు**

**కళారూపాల తయారీలో 770 మంది కళారులకు శిక్షణ**

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహణ**

**రూ.1.35 కోట్లు విడుదల చేసిన కేంద్రం**

**క్లస్టర్ల వారీగా శిక్షణ కార్యక్రమాలు**

**200 మందికి శిక్షణతో పాటు టూల్ కిట్ల అందజేస్తాం**

**రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత**



**మారుతున్న అభిరుచులు, హస్త కళలకు పెరుగుతున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హస్త కళాకారులకు మెరుగైన జీవనం, ఆర్థిక భరోసా కలిగించేలా చర్యలు చేపట్టాయి. హస్త కళారూపాల తయారీలో మరింత ప్రావీణ్యం పెంపొందించడంతో పాటు ఆధునిక డిజైన్ల తయారీలో శిక్షణా కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నాయి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.1.35 కోట్లను వెచ్చించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కళారూపాలను తయారు చేస్తున్న 770 మంది హస్త కళాకారులకు శిక్షణా కార్యక్రమాలు చేపట్టనుంది.**

ఇందుకోసం శిక్షణా కార్యక్రమాలు ఆయా కళారూపాలను బట్టి నెల, రెండు నెలల పాటు ఇవ్వనున్నారని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన జారీ చేసింది. రాష్ట్రంలో చేతివృత్తులకు అండగా నిలవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయన్నారు. ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేనేతలకు ఆర్థిక మేలు కలిగించడంతో పాటు చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచేలా ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఇప్పుడు హస్త కళాకారులకు కూడా ఆర్థిక భరోసా కలిగేలా ఆయా కళారూపాల తయారీలో మెరుగైన శిక్షణ ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా తీసుకుంటోందన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ప్రఖ్యాతిగాంచిన హస్త కళారూపాలను తయారీ చేస్తున్న కళాకారులను గుర్తించి మారుతున్న అభిరుచులకు అనుగుణంగా శిక్షణ ఇవ్వాలని రెండు ప్రభుత్వాలు నిర్ణయించాయన్నారు. ఈ శిక్షణల నిమిత్తం కేంద్ర ప్రభుత్వం రూ.1,35,16,314లను మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా మొదటి విడతగా రూ.1.01 కోటి నిధులు మంజూరయ్యాయన్నారు. రాష్ట్రంలో ఆయా క్లస్టర్లలో ఉన్న హస్త కళాకారులకు రెండు విధాలుగా శిక్షణివ్వనున్నట్లు వెల్లడించారు. గురు-శిష్యహస్త శిల్ప్ ప్రశిక్షణ్(జీహెచ్చ్‌పీ), డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) ద్వారా నెల, రెండు నెలల శిక్షణ ఇవ్వనున్నామన్నారు. గురు-శిష్య హస్త శిల్ప్ ప్రశిక్షణ్(జీహెచ్చ్‌పీ) రెండు నెలలు, డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) నెల రోజుల పాటు శిక్షణ అందజేయనున్నట్లు తెలిపారు. డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ)లోని కొయ్యబొమ్మల తయారీకి కూడా రెండు నెలల పాటు ఇవ్వనున్నామన్నారు.

**200 మందికి శిక్షణతో పాటు పనిముట్లు**

గురు-శిష్యహస్త శిల్ప్ ప్రశిక్షణ్(జీహెచ్చ్‌పీ) శిక్షణ కార్యక్రమంలో భాగంగా చెక్క బ్లాక్ తయారీ, కలంకారి బ్లాక్ ప్రింటింగ్, దుర్గి రాతి శిల్పం, అగరుబత్తి తయారీ, తాటి ఆకుల కళ, కొబ్బరి చిప్పల కళ, శ్రీకాళహస్తి కలంకారి వంటి హస్తకళలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) ద్వారా చెక్క శిల్పం, టెర్రకోట బొమ్మలు, లేస్/హ్యాండ్‌మేడ్ నిటెడ్ గూడ్స్, అల్లగడ్డ రాతి శిల్పం, శ్రీకాళహస్తి కలంకారి, వెదురు-చెరకు కళలు, సవర గిరిజన చిత్రకళ, బొబ్బిలి వీణ, ఇమిటేషన్ జ్యువెలరీ తదితర కళారూపాల తయారీపై మరో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. వారిలో అనంతపురం, పల్నాడు, అనకాపల్లి క్లస్టర్లకు చెందిన 50 మంది చొప్పున 200 మంది అరటి ఫైబర్, చెరకు-వెదురు, వుడ్ టర్నింగ్, ల్యాకర్‌వేర్, దుర్గి రాతి శిల్ప కళాకారులకు శిక్షణతో పాటు ఇంప్రూవ్డ్ టూల్ కిట్ డిస్ట్రిబ్యూషన్ ప్రోగ్రామ్(ఐటీడీపీ) ద్వారా పనిముట్లు పంపిణీ చేయనున్నామన్నారు. ఈశిక్షణా కార్యక్రమాలు కృష్ణా, గుంటూరు, ఎన్‌టీఆర్, అనకాపల్లి, డా. బీఆర్. అంబేద్కర్ కోనసీమ, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, తూర్పు గోదావరి, నంద్యాల, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం, అనంతపురం, పల్నాడు తదితర జిల్లాల్లోని కళాకారులకు ఉపయోగపడనున్నాయని మంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ హస్తకళలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంతో పాటు, కళాకారుల ఆదాయాన్ని పెంచడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. సంప్రదాయ కళలను కాపాడుతూ ఆధునిక డిజైన్లు, మెరుగైన శిక్షణ, నాణ్యమైన పనిముట్లు అందించడం ద్వారా హస్తకళాకారులకు ఆర్థికంగా మరింత వెన్నుదన్నుగా ఉండేలా ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు.

# బిజెపి నాయకుల అరెస్టు అప్రజాస్వామికం

## ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేసేవరకు పోరాడుతాం... బిజెపి రాష్ట్ర నాయకులు మర్రిపెల్లి సత్యమ్



**జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రాష్ట్రంలో నలభై లక్షల మంది విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన 15 వేల కోట్ల బకాయిలు చెల్లించేవరకు బిజెపి పార్టీ పోరాటం చేస్తుందని బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్రిపెల్లి సత్యమ్ తెలిపారు.మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించాలని బీజేపీ నేతలు శాంతియుతంగా నిరసన తెలియజేయడానికి అనుమతి కోరితే తెలంగాణ ప్రభుత్వం అనుమతి నిరాకరించడం వల్లనే అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టాల్సి వచ్చిందని ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా బిజెపి నేతలను కార్యకర్తలను ఎక్కడికక్కడ అడ్డుకొని దాడులు చేసి అరెస్టులు చేసి పోలీసు స్టేషన్లకు తరలించడం అప్రజాస్వామికమని అన్నారు. విద్యాశాఖ నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యా శాఖ నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని మర్రిపెల్లి సత్యమ్ డిమాండ్ చేశారు. గత ఆరు సంవత్సరాల కాలం నుండి తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వడం లేదని దీనివల్ల వేలాది మంది విద్యార్థులు తమ చదువు పూర్తి చేసుకున్న కూడా ప్రభుత్వం రీయింబర్స్మెంట్ ఇవ్వనందున కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు తమ వద్దనే ఉంచుకోవడం వల్ల చదువు పూర్తి చేసుకున్న యువత ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.అంతే కాకుండా తెలంగాణలోని గురుకుల పాఠశాలలు అరవై శాతం అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయని ప్రభుత్వం అద్దె కట్టలేని దుస్థితిలో ఉంటే పాఠశాలల యాజమాన్యాలు తాళాలు వేసిన ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని దున్నపోతు మీద వాన పడ్డట్లు ఉందని ఎద్దేవా చేశారు. విద్యా శాఖను నిర్వీర్యం చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గద్దె దించేవరకు విద్యార్థుల పక్షాన పోరాడుతామని అన్నారు.పదవ తరగతి పాసైన విద్యార్థులకు 10,000 ఇంటర్మీడియట్ పాస్ అయిన విద్యార్థులకు 20,000 డిగ్రీ పాసైన విద్యార్థులకు 50,000 పీజీ పాసైన విద్యార్థులకు లక్ష రూపాయలు బి.టెక్ ఎం.టెక్ లాంటి కోర్సుల్లో పాసైన విద్యార్థులకు 5 లక్షల రూపాయలు ఇస్తామని మోసం చేసిన విద్యాశాఖ మంత్రి రేవంత్ రెడ్డి రాజీనామా చేసే వరకు పోరాడుతామని అన్నారు.ఈసమావేశంలో బిజెపి మండల అధ్యక్షుడు పల్లె మోహన్ రెడ్డి ప్రధాన కార్యదర్శి కోట మల్లేశం ఉపాధ్యక్షులు వరద రాము మండల నాయకులు అజ్మీరా ఇంద్ర నాయక్, అంకమల్ల అనిల్, కదారి రాజిరెడ్డి,కూన సాగర్,బూరుగు నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో సిబ్బంది క్యాంపస్‌లోనే నివసించాలి

### విద్యార్థుల భద్రతకు నిబంధనలు కఠినంగా అమలు చేయాలి

### ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 07: తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న ప్రిన్సిపాల్ లు ఉపాధ్యాయులు, వార్డెన్లు, నర్సులు, ఇతర సిబ్బంది క్యాంపస్‌లోనే నివసించేలా చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు సంఘం ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో కొందరు సిబ్బంది క్యాంపస్‌లో నివసించకుండా బయట నుంచి రాకపోకలు సాగిస్తున్నారని, దీంతో విద్యార్థులకు రాత్రివేళ నిరంతర పర్యవేక్షణ లోపిస్తోందని సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. నైట్ స్టడీ సమయంలో ఉపాధ్యాయులు అందుబాటులో లేకపోవడం, అత్యవసర ఆరోగ్య పరిస్థితుల్లో తక్షణ స్పందనకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. ముఖ్యంగా బాలికల గురుకులాల్లో మహిళా వార్డెన్లు, మహిళా సిబ్బంది రాత్రివేళ క్యాంపస్‌లో తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరింది. నిబంధనలు ఉల్లంఘించే వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడంతో పాటు రాత్రి 9 గంటలకు బయోమెట్రిక్ లేదా జియోట్యాగ్ హాజరు అమలు చేయాలని డిమాండ్ చేసింది. రాత్రి 8 గంటల తర్వాత ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, ప్రతి హాస్టల్‌లో తల్లిదండ్రుల ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్, ఫిర్యాదు పెట్టె ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసింది. వారం రోజుల్లో చర్యలు తీసుకోకపోతే తల్లిదండ్రులతో కలిసి శాంతియుత నిరసన చేపడతామని సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పత్రి లలితారాణి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి కైకాలపురం రాములు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నరసాపురం శంకర్, ఉపాధ్యక్షులు జయప్రకాష్, పల్లవి, ప్రెజర్ లక్ష్మి, బీపీఎల్ కమిటీ సభ్యులు రాజు, బి. నర్సింలు తదితరులు పాల్గొన్నారు.




క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595


# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు బీజేపీ చలో అసెంబ్లీ



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో 'చలో అసెంబ్లీ' కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు పిలుపు మేరకు చేపట్టిన ఈ నిరసనలో విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తొకల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కిస్మత్‌పూర్ 122వ డివిజన్ బీజేఎంసీ జనరల్ సెక్రటరీ నీరుడు పవన్‌సాయి పాల్గొన్నారు. నిరసన సందర్భంగా పవన్‌సాయిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని బీజేపీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# 22ఏ భూములు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై పోరాటం చేస్తే గృహ నిర్బంధమా?



గండిపేట(క్రైమ్ మిర్రర్): 22ఏ నిషేధిత భూముల జాబితా నుంచి అక్రమంగా చేర్చిన భూములను తొలగించాలని, విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ చేపట్టిన ఆందోళనకు వెళ్లకుండా కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు నిరుడు శేఖర్ ముదిరాజ్‌ను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. బుధవారం ఉదయం 6 గంటల సమయంలోనే పోలీసులు తనను బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారని శేఖర్ ముదిరాజ్ తెలిపారు. ప్రజా సమస్యలపై ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపేందుకు వెళ్తున్న నాయకులను ముందస్తుగా గృహ నిర్బంధం చేయడం అప్రజాస్వామిక వైఖరికి నిదర్శనమని ఆయన విమర్శించారు. 22ఏ భూముల సమస్య, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి ప్రజా సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని శేఖర్ ముదిరాజ్ స్పష్టం చేశారు.



# కాంగ్రెస్ తీరుకు నిరసనగా బీఆర్ఎస్ ధర్నా

### సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం

### ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేత

### మునుగోడు మాజీ ఎమ్మెల్యే కుసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి



**క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తీవ్ర కాలయాపన చేస్తోందని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ నాయకులు భారీ ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి విచ్చేసి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, హక్కుల సాధన కోసం మళ్లీ ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కేసీఆర్ హయాంలోనే రైతుబంధు, కేసీఆర్ కిట్లు, కళ్యాణలక్ష్మి వంటి సంక్షేమ పథకాలతో పాటు నియోజకవర్గంలో విస్తృత అభివృద్ధి పనులు జరిగాయని గుర్తుచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బీఆర్ఎస్ శ్రేణులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. హామీల అమలును కోరుతూ ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కూసుకుంట్ల సత్తిరెడ్డి, సుర్వి యాదయ్య గౌడ్, అందోజు శంకరాచారి, నర్రీ నరసింహ, జక్కర్తి పాపయ్య, నలపరాజు రమేష్, చిత్రసేనారెడ్డి, రాచకొండ గిరి, పాండురంగ నాయక్, రాజు నాయక్, తరుణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# తమ్మడపల్లిలో ఘనంగా ముత్యాలమ్మ బోనాలు

### చెల్లం వెంకటేష్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా మారు బోనం..

### వర్షాన్ని సైతం లెక్కచేయని భక్తులు



**మర్రిగూడ (క్రైమ్ మిర్రర్):** మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో ముత్యాలమ్మ బోనాల పండుగను గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామ ఆడపడుచులు బోనాలను నెత్తిన ఎత్తుకుని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముత్యాలమ్మ తల్లి కృపతో గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటూ భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల పండుగలో భాగంగా రెండో రోజు నిర్వహించిన, మారు బోనం కార్యక్రమం ఆర్గనైజర్ చెల్లం వెంకటేష్ ఆధ్వర్యంలో అత్యంత ఉత్సాహ భరితంగా సాగింది. గ్రామ సంప్రదాయాలు, ఆధ్యాత్మికతకు ప్రాధాన్యతనిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో వెంకటేష్ ప్రత్యేక చొరవ చూపారు. భక్తులు, యువత, గ్రామ ఆడపడుచులను సమన్వయం చేస్తూ, పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహంగా మార్చడంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. పోతురాజుల వేషధారణలు, సాంస్కృతిక సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డీజే చప్పుళ్ల నడుమ గ్రామ పురవీధుల్లో బోనాల ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. ఆడపడుచులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఆనందోత్సాహాలతో అమ్మవారిని దర్శించుకున్నారు. బోనాల కార్యక్రమం జరుగుతున్న సమయంలో వర్షం కురిసినప్పటికీ, భక్తుల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు బోనాల ఊరేగింపులో పాల్గొని, ముత్యాలమ్మ తల్లికి మొక్కులు చెల్లించారు. దీనితో తమ్మడపల్లి గ్రామ పురవీధులు భక్తుల సందడితో కిక్కిరిసాయి. ముత్యాలమ్మ బోనాల నిర్వహణలో చెల్లం వెంకటేష్ చూపిన ప్రత్యేక శ్రద్ధ, సమన్వయం, ముందుండి కార్యక్రమాన్ని నడిపించిన తీరు గ్రామస్తుల ప్రశంసలు అందుకుంది. పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఆయన చేసిన కృషి వల్ల, తమ్మడపల్లిలో ఆధ్యాత్మిక వాతావరణంతో పాటు పండుగ సందడి నెలకొంది.

# బృందావన్ కాలనీ ప్రధాన రహదారిపై హోటల్ యాజమాన్యం బరితెగింపు

### సీసీ రోడ్డును ఆక్రమించి భారీ ర్యాంపు నిర్మాణం, నరకయాతన అనుభవిస్తున్న కాలనీవాసులు, వాహనదారులు!

### అధికారుల నిమ్మకు నీరెత్తిన వైఖరి..

### తక్షణమే అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలని స్థానిక ప్రజల డిమాండ్




**గండిపేట్,(క్రైమ్ మిర్రర్):** నార్సింగి సర్కిల్ పరిధిలోని బృందావన్ కాలనీ ప్రధాన రహదారిపై ఒక హోటల్ యాజమాన్యం ఆక్రమణల పర్వానికి తెరలేపి స్థానిక ప్రజల సహనాన్ని తీవ్రంగా పరీక్షిస్తోంది. ప్రభుత్వ నిబంధనలను, మున్సిపల్ చట్టాలను పూర్తిగా గాలికొదిలేసి ఏకంగా ప్రజా రహదారినే ఆక్రమిస్తూ భారీ కాంక్రీట్ ర్యాంపును నిర్మించింది. స్థానికంగా అత్యంత కీలకమైన, నిత్యం వేలాది మంది ప్రయాణించే సిమెంట్ కాంక్రీట్ (సీసీ) ప్రధాన రహదారిలో సగానికి పైగా భాగాన్ని ఆక్రమించి చేపట్టిన ఈ అక్రమ నిర్మాణంతో కాలనీవాసులు, వాహనదారులు, బాటసారులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా నిత్యం జనసాంద్రతతో ఉండే ఈ మార్గంలో హోటల్ నిర్వాహకులు తమ సొంత వ్యాపార ప్రయోజనాల కోసమే ఏకపక్షంగా రోడ్డు పైకే భారీ ర్యాంపును నిర్మించడంతో ప్రజా రవాణా వ్యవస్థ పూర్తిగా చిన్నాభిన్నమైంది. ఏళ్ల తరబడి ఎంతో విస్తారంగా ఉన్న రహదారిని ఇలా బహిరంగంగా ఆక్రమించి కాంక్రీట్ దిమ్మెలు లేపినా, బాధ్యతాయుతమైన మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆక్రమణదారుల ఆగడాలకు హద్దు లేకుండా పోతోందని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**స్వార్థ పూరిత వ్యాపారం.. ప్రజల ప్రాణాలతో చెలగాటం**

హోటల్‌కు వచ్చే కస్టమర్ల వాహనాలు, సరుకుల రవాణా చేసే వాహనాల సౌకర్యం కోసమే యాజమాన్యం ఈ బహిరంగ ఆక్రమణకు పాల్పడినట్లు స్థానికులు మండిపడుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారిపై సగానికి పైగా భాగం ఆక్రమణకు గురికావడంతో రోడ్డు అత్యంత ఇరుకుగా మారింది. ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాల బస్సులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగుల వాహనాలు గంటల తరబడి నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మలుపు వద్ద నిర్మించిన ఈ ఎత్తైన ర్యాంపు రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులకు మృత్యుపాశంగా మారింది.

**టౌన్ ప్లానింగ్ అధికారుల మౌనం వెనుక మర్మమేమిటి?**

కళ్ల ముందే బహిరంగంగా ప్రజా రహదారిని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నా నార్సింగి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కనీసం కన్నెత్తి చూడకపోవడంపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆక్రమణలపై స్థానికులు పలుమార్లు దృష్టికి తీసుకెళ్లినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అండదండలు, నిర్లక్ష్య వైఖరి వల్లే హోటల్ యాజమాన్యం ఇంతగా తెగబడుతోందని ఆరోపిస్తున్నారు.

**అక్రమ ర్యాంపును వెంటనే కూల్చివేయాలి**

ప్రజా ఆస్తి అయిన రహదారిని ఆక్రమించి నిర్మించిన ర్యాంపును తక్షణమే మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి కూల్చివేయాలని, రహదారిని పూర్వ రూపంలోకి తీసుకురావాలని కాలనీవాసులు, స్థానిక సంక్షేమ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న హోటల్ యాజమాన్యంపై కఠిన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.

## ఎస్‌ఓటి సిబ్బందిగా నటించి దోపిడీ.. ఇద్దరు అరెస్ట్

### మరో నిందితుడి కోసం పోలీసుల గాలింపు

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 07:** ఎస్‌ఓటి సిబ్బందిగా నటించి ఇంట్లోకి చొరబడి మహిళను బెదిరించి నగదు, బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు దోచుకున్న ఘటనలో ఇద్దరు నిందితులను పటాన్‌చెరు పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ముత్తంగి గ్రామంలోని సనా వెంచర్‌లో సెప్టెంబర్ 2న ముగ్గురు వ్యక్తులు ఎస్‌ఓటి సిబ్బందిగా తప్పుడు గుర్తింపు చూపిస్తూ ఓ ఇంట్లోకి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న మహిళను బెదిరించి దాడి చేసి, అల్మారాను పగులగొట్టి రూ.70 వేల నగదును దోచుకున్నారు. అనంతరం ఆమె మొబైల్ ఫోన్ ద్వారా యూకో బ్యాంకు ఖాతా నుంచి రూ.24,500, ఫెడరల్ బ్యాంకు ఖాతా నుంచి రూ.13,000లను తమ ఖాతాలకు బదిలీ చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సేకరించిన ఆధారాల ఆధారంగా లింగంపల్లి వద్ద ఎ1 కొమటి విజయ్‌కుమార్, ఎ3 కెరెల్లి యాదిరెడ్డిని సెప్టెంబర్ 6న పోలీసులు అరెస్ట్ చేశారు. ఇద్దరినీ రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. ఎ2 మణిగండ్ల విజయ్‌కుమార్ అలియాస్ చిన్నా పరారీలో ఉన్నాడని, అతని కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు ఎవరైనా పోలీస్ లేదా ఎస్‌ఓటి సిబ్బందిగా పరిచయం చేసుకుంటే వారి గుర్తింపును నిర్ధారించుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పటాన్‌చెరు పోలీసులు సూచించారు.

## శంషాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మహిళా మంత్రుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ శంషాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. కొత్వాల్‌గూడ 119వ డివిజన్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యబద్ధంగా తమ సమస్యలను వ్యక్తం చేస్తున్న ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, మాజీ మహిళా మంత్రుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు సరికాదని ఆరోపించారు. ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 118, 119 డివిజన్లతో పాటు మండలానికి చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.

## జన్వాడలో అక్రమ లేఅవుట్, నిర్మాణాలపై ఉక్కుపాదం

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** అనధికారిక లేఅవుట్లు, అక్రమ నిర్మాణాలపై అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నార్సింగి సర్కిల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది, హెచ్ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సంయుక్తంగా సోమవారం జన్వాడ గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన లేఅవుట్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు ధ్వంసం చేశాయి. లేఅవుట్‌లో చేపట్టిన అక్రమ నిర్మాణాలు, నిర్మాణ భాగాలను సైతం కూల్చివేశారు. సంబంధిత నిబంధనల ప్రకారం ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. భూ యజమానులు, డెవలపర్లు, ప్రజలు సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందిన తర్వాతే లేఅవుట్లు, నిర్మాణాలు చేపట్టాలని అధికారులు సూచించారు. అనుమతులు లేకుండా లేఅవుట్లు ఏర్పాటు చేయడం, నిర్మాణాలు చేపట్టడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. అక్రమ లేఅవుట్లు, అనధికార నిర్మాణాలపై నార్సింగి టౌన్ ప్లానింగ్ విభాగం, హెచ్ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు సంయుక్తంగా తనిఖీలు, చర్యలను కొనసాగించనున్నట్లు అధికారులు వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.







## మణికొండ, నెక్నాంపూర్ సమస్యలపై బీఆర్ఎస్ పోరుబాట

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలు, 420 హామీల పేరుతో అధికారంలోకి వచ్చి ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. మణికొండ, నెక్నాంపూర్ ప్రాంతాల్లో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, ట్రాఫిక్, విద్యుత్ స్తంభాలు, ఇంటి నంబర్ల వంటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన పోరుబాటలో భాగంగా బీఆర్ఎస్ నాయకులు సీతారం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్‌రావు, ఆరిఫ్ మహమ్మద్, సుమనళిని, జయరాం, బాబురావు, మంజుల, శివ తదితరులు ప్రజావాణి ద్వారా సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు సమస్యలతో కూడిన ఛార్జ్‌షీట్‌ను అందజేశారు. పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో యూట్యూబర్ నందన అదుపులోకి



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** లుక్‌అవుట్ నోటీసులు జారీ అయిన నేపథ్యంలో యూట్యూబర్ నందనను ఆర్‌జీఐఏ పోలీసులు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. విమానాశ్రయంలో ఆమెను గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ నిమిత్తం ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నందనతో పాటు ఆమె భర్త పలువురి నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉద్యోగాల పేరుతో డబ్బులు తీసుకుని మోసం చేశారన్న ఫిర్యాదుల నేపథ్యంలో పోలీసులు కేసులపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో నందనపై నమోదైన కేసులు, ఆమెకు జారీ చేసిన లుక్‌అవుట్ నోటీసుల ఆధారంగా పోలీసులు తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నారు. నందనను ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించిన అనంతరం కేసుకు సంబంధించిన అంశాలపై మరింత విచారణ చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆరోపణలకు సంబంధించి పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

## తిమ్మారెడ్డిగూడలో సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన సదస్సు

**క్రైమ్ మిర్రర్ షాబాద్, సెప్టెంబర్ 7:** షాబాద్ మండలం తిమ్మారెడ్డిగూడ గ్రామంలో వెల్స్పున్ ఫౌండేషన్ సహకారంతో, జనవికాస్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (జీఎ=ఆ) ఆధ్వర్యంలో రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గుత్తి చెన్నయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు పలు సేంద్రీయ సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. సేంద్రీయ వ్యవసాయ నిపుణులు జి. శ్రీకాంత్ మాట్లాడుతూ జీవామృతం, బీజామృతం, నీమాస్త్రం, దశపర్ణి కషాయం తయారీ, వినియోగ విధానాలను వివరించారు. వీటి వినియోగంతో నేల సారం, సేంద్రియ కార్బన్ పెరగడంతో పాటు పంట ఆరోగ్యం మెరుగుపడి సాగు ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. వెల్స్పున్ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ పవన్ కుమార్ మట్టి నమూనాల సేకరణ విధానం, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు, సేంద్రీయ ఉత్పత్తులకు పెరుగుతున్న మార్కెట్ డిమాండ్, మెరుగైన ధరలు, మార్కెటింగ్ అనుసంధానాలపై వివరించారు. సేంద్రీయ సాగు ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచుకునే అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుత్తి చెన్నయ్య, వెల్స్పున్ కోఆర్డినేటర్ బద్రి, ఏఈఓ శైలజ, జీఎ=ఆ సీఈఓ సంపత్ కుమార్, ప్రాజెక్ట్ ఫిషిఫర్మేర్స్ స్టార్టప్ సీఈఓ సాయి కృష్ణ, సిబ్బంది రామకృష్ణ, సత్యనారాయణ, రమేష్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు. నేల ఆరోగ్య పరిరక్షణ, సాగు ఖర్చుల తగ్గింపు, రసాయన రహిత వ్యవసాయం, మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడం ద్వారా రైతుల జీవనోపాధిని అభివృద్ధి చేయడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

## శివసాయి కాలనీలో వైద్యనాథేశ్వర స్వామి ఆలయ వార్షిక పూజలు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గం బండ్లగూడ జాగిర్ 123వ డివిజన్ పరిది లోని శివసాయి కాలనీ ఫేజ్-1లో శ్రీ వైద్యనాథేశ్వర స్వామి ఆలయం నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రుద్రాయ నమః హోమంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీ అధ్యక్షుడు రాజారామ్ ఆధ్వర్యంలో, కాలనీవాసుల సహకారంతో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా 123వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి, నార్సింగ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్‌కుమార్ పాల్గొని స్వామివారిని దర్శించు కున్నారు. ఏ బ్లాక్ అధ్యక్షుడు డప్పు నవీన్, మాజీ ఎంపీటీసీ భోగాల శ్రీనివాస్, బీసీ సెల్ అంకం శ్రీనివాస్ నేత, రాంప్రసాద్, హరీష్ గౌడ్, శాంతినగర్ శ్రీనివాస్ ముదిరాజ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు. కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

## నారాయణ పాఠశాలలో టీచర్స్ డే వేడుకలు




**కూకట్ పల్లి, సెప్టెంబర్ 07 (క్రైమ్ మిర్రర్) :** జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని నారాయణ పాఠశాలలో సోమవారం టీచర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల డైరెక్టర్ రమ, డీజీఎం గోపాల్ రెడ్డి, కూకట్పల్లి జోన్ ఏజీఎం వేణుగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రామ మాట్లాడుతూ విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చే బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవం విశిష్టత, ఉపాధ్యాయుల పాత్ర, విద్యను అభ్యసించడం వలన కలిగే ప్రయోజనాలు తదితర విషయాలను సంక్షిప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి జోన్ పరిధిలోని నారాయణ పాఠశాలల వివిధ శాఖల ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్ ®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
మంగళవారం 8-9-2026


# తిమ్మారెడ్డిగూడలో సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన సదస్సు




**క్రైమ్ మిర్రర్ షాబాద్, సెప్టెంబర్ 7:** షాబాద్ మండలం తిమ్మారెడ్డిగూడ గ్రామంలో వెల్స్పన్ ఫౌండేషన్ సహకారంతో, జనవికాస్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (జీఎ=ఋా) ఆధ్వర్యంలో రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గుత్తి చెన్నయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు పలు సేంద్రీయ సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. సేంద్రీయ వ్యవసాయ నిపుణులు జి. శ్రీకాంత్ మాట్లాడుతూ జీవామృతం, బీజామృతం, నీమాస్త్రం, దశపర్ణి కషాయం తయారీ, వినియోగ విధానాలను వివరించారు. వీటి వినియోగంతో నేల సారం, సేంద్రియ కార్బన్ పెరగడంతో పాటు పంట ఆరోగ్యం మెరుగుపడి సాగు ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. వెల్స్పన్ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ పవన్ కుమార్ మట్టి నమూనాల సేకరణ విధానం, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు, సేంద్రీయ ఉత్పత్తులకు పెరుగుతున్న మార్కెట్ డిమాండ్, మెరుగైన ధరలు, మార్కెటింగ్ అనుసంధానాలపై వివరించారు. సేంద్రీయ సాగు ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచుకునే అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుత్తి చెన్నయ్య, వెల్స్పన్ కోఆర్డినేటర్ బద్రి, ఏఈఓ శైలజ, జీఎ=ఋా సీఈఓ సంపత్ కుమార్, ప్రాజెక్ట్ ఫిషిఫర్మేర్స్ స్టార్టప్ సీఈఓ సాయి కృష్ణ, సిబ్బంది రామకృష్ణ, సత్యనారాయణ, రమేష్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు. నేల ఆరోగ్య పరిరక్షణ, సాగు ఖర్చుల తగ్గింపు, రసాయన రహిత వ్యవసాయం, మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడం ద్వారా రైతుల జీవనోపాధిని అభివృద్ధి చేయడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.



## మధుబన్, శ్రీరామ్ కాలనీల్లో అభివృద్ధి పనులకు రూ.7 లక్షలు మంజూరు

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్ ఆదేశాల మేరకు మధుబన్ కాలనీ, శ్రీరామ్ కాలనీల మధ్య రహదారికి ఇరువైపులా ఎక్స్‌టెన్షన్ పనుల కోసం రూ.7 లక్షలు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు బస్తీ ప్రజలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా డ్రైనేజీ, రోడ్ల సమస్యలను ప్రజలు వారి దృష్టికి తీసుకురావడంతో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి సమస్య ఎదురైనా అందుబాటులో ఉంటూ పరిష్కారానికి కృషి చేస్తామని టి. ప్రేమ్ గౌడ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఎన్. ధనుంజయ, అర్జున్ గౌడ్, నాని, శ్రీనివాస్ రెడ్డి, నిరంజన్, ప్రశాంత్ గౌడ్, చిన్న తదితర కాంగ్రెస్ నాయకులు, బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

## సిద్దులగుట్ట జాతరలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** సిద్దులగుట్ట శ్రీ వెండికొండ సిద్ధేశ్వర స్వామివారి 71వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు. శ్రావణ మాసం చివరి సోమవారం సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. జాతరలో మహా రుద్రాభిషేకం, మహామంగళహారతి, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, శివభక్తులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్‌గా గద్వాల విజయలక్ష్మి బాధ్యతలు

### మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఆకుల నరేందర్ ముదిరాజ్



**బాలానగర్, సెప్టెంబర్ 07 (క్రైమ్ మిర్రర్) :** తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్‌గా మాజీ హైదరాబాద్ మేయర్, తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి సోమవారం ప్రగతి భవన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం గద్వాల విజయలక్ష్మిని మేడ్చల్ జిల్లా మత్స్యకారుల కమిటీ వైస్ చైర్మన్, బాలానగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఆకుల నరేందర్ ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆకుల నరేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్‌గా విజయలక్ష్మికి కీలక బాధ్యతలు దక్కడం సంతోషకరమని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సమగ్ర ప్రణాళిక రూపకల్పనలో ఆమె తన అనుభవాన్ని ఉపయోగించి మరింత సమర్థవంతంగా పనిచేస్తారనే విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజా సేవలో ఇప్పటికే మేయర్‌గా, మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా సేవలందించిన విజయలక్ష్మికి తాజాగా మరో కీలక బాధ్యత లభించడం పట్ల ముదిరాజ్ సంఘం నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



## ముడావత్ శివరాంకు రంగారెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మణికొండ జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు ముడావత్ శివరాంకి రంగారెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించడం ఎంతో ఆనందదాయకమని మణికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రకటించింది. ఇందులో భాగంగా మణికొండ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులుగా సేవలందిస్తున్న ముడావత్ శివరాంకి రంగారెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఈ సందర్భంగా సోమవారం మణికొండ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ముడావత్ శివరాంని రామకృష్ణారెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. శివరాం పాఠశాలకు ఎంతో సేవలందిస్తూ, విద్యార్థులకు ఉత్తమమైన విద్యాబోధన అందిస్తున్నారని అన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని గుర్తించిన ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించడం అభినందనీయమన్నారు. ఈ అవార్డు మణికొండ ప్రాంతానికి, పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, నాయకులు తదితరులు పాల్గొని ముడావత్ శివరాంని అభినందించారు.




## అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా బీజేపీ నాయకుడి ముందస్తు అరెస్టు

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనకుండా రాజేంద్రనగర్ పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఉదయం 7 గంటలకు తన ఇంటికి వచ్చిన పోలీసులు తనను ప్రివెంటివ్ అరెస్టు చేసినట్లు బీజేపీ గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్, రాజేంద్రనగర్ డివిజన్ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఈ. వేణుగోపాల్ తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించ తలపెట్టిన కార్యక్రమాలను అరెస్టులతో అడ్డుకోవడం సరికాదని ఆయన విమర్శించారు. అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ప్రజలే తిప్పికొడతారని అన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోలీసులు తనను అదుపులో ఉంచారని వేణుగోపాల్ తెలిపారు.

## టీచర్స్ డే సందర్భంగా ఎంజిఐటి ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లకు ఘన సత్కారం




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** టీచర్స్ డే సందర్భంగా మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజిఐటి)కి చెందిన విద్యా ప్రముఖులకు పలు విశిష్ట గౌరవాలు లభించాయి. ఎంజిఐటి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. చంద్ర మోహన్ రెడ్డిని సెప్టెంబర్ 5న సిబిఐటిలో ఘనంగా సత్కరించగా, సెప్టెంబర్ 6న అకడమిక్ లీడర్‌షిప్ విభాగంలో శిక్షా రత్న అవార్డు--2026 అందుకున్నారు. అదేవిధంగా ఎంజిఐటి సిఎస్ఇ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.వి. రజనీకాంత్‌కు ఆచార్య రత్న అవార్డ్తో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఉత్తమ బోధన, విద్యా నాయకత్వం, వినూత్న బోధనా విధానాలకు గుర్తింపుగా ఈ పురస్కారం అందించారు. ఈ గౌరవాలు అందుకున్న ప్రొఫెసర్ జి. చంద్ర మోహన్ రెడ్డి, ప్రొఫెసర్ టి.వి. రజనీకాంత్‌లను ఎంజిఐటి యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

## మణికొండ జెడ్పీ హైస్కూల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** జిల్లా పరిషత్ హైస్కూల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ప్రధానోపాధ్యాయురాలు అరుణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలు, మంచి నడవడికను నేర్పడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. కార్యక్రమంలో మణికొండ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు బుద్ధోల శ్రీరాములు, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఎర్పుల కుమార్, లక్ష్మీశ్రీ, నాయకులు శ్రవణ్ కుమార్, సంతోష్, మహిళా అధ్యక్షురాలు సావిత్రి, ఏ-బ్లాక్ మహిళా అధ్యక్షురాలు ఇంధీర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## అసెంబ్లీ ముట్టడికి యత్నించిన బీజేపీ నేతల అరెస్ట్





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పిలుపు మేరకు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలను డిమాండ్ చేస్తూ చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి రాజేంద్రనగర్ డివిజన్ నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ముట్టడిని అడ్డుకునేందుకు పోలీసులు ముందస్తు హౌస్ అరెస్టులు చేసినప్పటికీ, పలువురు నాయకులు అసెంబ్లీ గేటు వరకు చేరుకున్నారు. అనంతరం పోలీసులు వారిని అరెస్ట్ చేసి ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్, మాజీ అధ్యక్షుడు బాబురావు, ఓబీసీ జిల్లా కార్యదర్శి హరికిషన్, జిల్లా కౌన్సిలింగ్ సభ్యుడు బండారి బాలకృష్ణ, యువమోర్చా నాయకుడు రాకేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా సినిమా షూటింగ్.. ముగ్గురు మేనేజర్లపై కేసు




గండిపేట(క్రైమ్ మిర్రర్): అలకాపురి--పుప్పలగూడ ప్రాంతంలో పోలీసుల అనుమతులు లేకుండా సినిమా షూటింగ్ నిర్వహిస్తున్న ముగ్గురు మేనేజర్లపై నర్సింగి పోలీసులు కేసు నమోదు చేశారు. ట్రాఫిక్ పోలీసులు పెట్రోలింగ్‌లో భాగంగా షూటింగ్‌ను గుర్తించి నిర్వాహకులను విచారించగా, అవసరమైన పోలీస్ అనుమతులు, ఎన్‌ఓసీ లేవని తేలింది. షూటింగ్ ప్రాంతంలో హీరోతో పాటు సినీ కళాకారులు, సిబ్బంది ఉన్నట్లు పోలీసులు తెలిపారు. షూటింగ్ నిర్వహణ బాధ్యతలు చూస్తున్న చింతల చెరువు శివ, ఎస్.ఏ. షబ్బీర్, చింత చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సినిమా షూటింగ్‌లకు ముందస్తుగా సంబంధిత అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని నర్సింగి ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

# 420 అడుగుల 'బాకీ కార్డు'తో బీఆర్ఎస్ భారీ నిరసన

## 22ఏ జాబితాలో ఆస్తుల చేర్పుపై ఆగ్రహం..

### ప్రజా భూముల విక్రయంపై ప్రభుత్వాన్ని నిలదీత

### కేపీహెచ్‌బీలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం






**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 07 (క్రైమ్ మిర్రర్) :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం కేపీహెచ్‌బీ డివిజన్‌లో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచనల మేరకు కేపీహెచ్‌బీ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందాడి శ్రీనివాసరావు, బాలాజీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పగడాల శిరీష బాబురావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. కేపీహెచ్‌బీ టెంపుల్ బస్‌స్టాప్ నుంచి మూడో ఫేజ్‌లోని జయశంకర్ విగ్రహం వరకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 420 అడుగుల పొడవైన 'బాకీ కార్డు'ను ప్రదర్శిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జయశంకర్ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు.

**22ఏ జాబితాపై తీవ్ర ఆగ్రహం**

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కేపీహెచ్‌బీ డివిజన్‌లోని వసంత్‌నగర్ తదితర ప్రాంతాల్లో ప్రజల ఆస్తులను 22ఏ జాబితాలో చేర్చి యజమానులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలు అనుభవిస్తున్న ఆస్తులపై అనిశ్చితి నెలకొనడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. అదేవిధంగా ప్రజా అవసరాలకు ఉపయోగపడాల్సిన భూములను కోట్లాది రూపాయలకు విక్రయించడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రయోజనాలకు కేటాయించాల్సిన భూములను కాపాడాల్సిన ప్రభుత్వం వాటిని విక్రయించడం సరికాదని విమర్శించారు.

**హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం**

ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ఇచ్చిన హామీల అమలుకు బదులుగా ఇప్పటికే అమల్లో ఉన్న సంక్షేమ కార్యక్రమాలకు కూడా ఆటంకాలు కల్పించిందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాల్లో సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయని, ఆర్థిక ఇబ్బందులతో సామాన్య ప్రజలు సతమతమవుతున్నారని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పందించే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. "ప్రజల ఆస్తుల పరిరక్షణ, ప్రజా భూముల రక్షణ కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధం. ప్రజలకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది" అని నాయకులు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ సమన్వయకర్త రెడ్డి సతీష్ అరోరా, డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు కృష్ణారెడ్డి, ప్రభాకర్‌గౌడ్, వెంకటేష్, రాజేష్‌రాయ్, సీనియర్ నాయకులు శ్యామల రాజు, అడుసుమిల్లి వెంకటేశ్వరరావు, కే. పవన్‌కుమార్, హరినాథ్, సురేష్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శివారెడ్డి, కంచరపల్లి నాగరాజు, సుభాష్‌గౌడ్, రమణ, రాంబాబునాయుడు, కచిన్ టైలర్, వలవల నాయుడు, శ్రీనివాసరెడ్డి, తులసిరెడ్డి, పాతూరి గోపి, సాయి శ్రీనివాస్, రావెల్ షా, మోజేష్, దినేష్, రవిసింగ్ తదితరులు పాల్గొన్నారు. మహిళా నాయకులు అనిత, శ్రీపాద, అరుణశెట్టి, లక్ష్మీరాజ్యం, ధనలక్ష్మి, హేమ, సుబ్బలక్ష్మి, లక్ష్మి, ఉష, లలిత, స్వప్న, సావిత్రి, ప్రేమలత తదితరులు పాల్గొని నిరసనకు మద్దతు తెలిపారు.



# నర్సాపూర్‌లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం.. భగ్గుమన్న బీఆర్ఎస్!

### సీఎం రేవంత్ రెడ్డి తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన

### అడ్డుకునేందుకు పోలీసుల యత్నం.. అప్పటికే దిష్టిబొమ్మ దహనం

### కొద్దిసేపు ఉద్రిక్తత.. నర్సాపూర్‌లో రాజకీయ వేడి

**నర్సాపూర్, హైదరాబాద్ మిర్రర్ సెప్టెంబర్ 07:** మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో బీఆర్ఎస్ శ్రేణులు చేపట్టిన నిరసనతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. సోమవారం మధ్యాహ్నం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు దహనం చేసి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఒకచోట చేరి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మ దహనానికి దిగారు. దీంతో నర్సాపూర్‌లో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దిష్టిబొమ్మ దహనం విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దిష్టిబొమ్మను దహనం చేయకుండా అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. అయితే పరిస్థితిని అదుపులోకి తీసుకునేలోపే బీఆర్ఎస్ నాయకులు దిష్టిబొమ్మకు నిప్పంటించారు. ప్రభుత్వ విధానాలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై తమ అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ నాయకులు ఈ నిరసన చేపట్టినట్లు తెలిపారు. అయితే నిరసనకు సంబంధించిన పూర్తి కారణాలను బీఆర్ఎస్ నాయకులు తమ ప్రకటనలో వెల్లడించారు. దిష్టిబొమ్మ దహనంతో నర్సాపూర్‌లో కొద్దిసేపు రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో నర్సాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్‌తో పాటు 10 వార్డ్ బుల్లెట్ రాజు, నాగరాజు గౌడ్ రింగుల ప్రసాద్ భోగ శేఖర్, పబాల బిక్షపతి, నయీముద్దీన్, బాల్‌రెడ్డి, ఆంజనేయులు తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మొత్తానికి.. నర్సాపూర్‌లో దిష్టిబొమ్మ దహనంతో రాజకీయ వేడి ఒక్కసారిగా రాజుకుంది. బీఆర్ఎస్ నిరసనకు దిగడంతో అధికార, ప్రతిపక్ష శ్రేణుల మధ్య పొలిటికల్ ఫైట్ మరోసారి తెరపైకి వచ్చింది.

# రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ పై అనుచిత వాక్యాలు చేసిన అమర ప్రసాద్ ను వెంటనే అరెస్టు చేయాలి

### దళిత యువశక్తి యువజన సంఘం మండల అధ్యక్షులు కర్రే భరత్ కుమార్ ప్రధాన కార్యదర్శి గుండుమల్ల నర్సింహులు



క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: ప్రపంచ మేధావి భారతరత్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అమచిత వ్యాఖ్యలు చేసిన అమర ప్రసాద్ అలియాస్ వరప్రసాద్ పై చట్టపరమైన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని కుల్కచర్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద దళిత సంఘాలు ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ మేధావి అయిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆయన రాజ్యాంగం రాయలేదని అంబేద్కర్ బ్రతికి ఉంటే చంపేసేవాడినని అంటూ మతోన్మాది అమర ప్రసాద్ చేసిన వ్యాఖ్యలు యావత్ భారత దేశాన్ని అవమానపరిచే విధంగా ఉన్నాయని అందుకే అమర ప్రసాదును వెంటనే అరెస్టు చేసి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్య తీసుకోవాలని వారు సూచించారు. అమర ప్రసాద్ కులాల మధ్య మతాల మధ్య చిచ్చుపెట్టే విధంగా మాట్లాడడం సరైన పద్ధతి కాదని అందుకే అమర ప్రసాద్ పై చట్టపరమైన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నాయకులు ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు కుల్కచర్ల పోలీస్ స్టేషన్లో ఎస్సై రమేష్ కుమార్ కు ఫిర్యాదు చేయడం జరిగింది. ఇలాంటి వ్యాఖ్యలు మళ్లీ పునరావృత్తమైతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత యువశక్తి యువజన సంఘం మండల ఉపాధ్యక్షులు వై రాములు, కోశాధికారి శివుని చుక్కయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దళిత యువశక్తి యువజన సంఘం మాజీ అధ్యక్షులు తుప్పలి వెంకటేష్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నాగని వెంకట్ రాములు, కుల్కచర్ల మాజీ సర్పంచ్ జోగు వెంకటయ్య, మండల మాజీ ప్రధాన కార్యదర్శి గజ్జి లక్ష్మయ్య, మైపాల్ బుగ్గయ్య తగ్గుల సురేష్ గజ్జి వెంకటయ్య నాగని బుచ్చయ్య జెట్టిగల వెంకటయ్య శివని ఎల్లయ్య నాగని ఎల్లయ్య దూల కాడి మొగులయ్య, పోతగల కృష్ణ పోతగల చిన్న గోపాలు మేకుల యాదయ్య శివ్వని శ్రీనివాస్ సాలెటి చిన్నయ్య చల్ల పురం జంగయ్య, సురేష్ సాలేటి వెంకటయ్య రాహుల్ దోమ రమేష్ దోమ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ మైలార్‌దేవ్‌పల్లిలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

**గండిపేట్,(క్రైమ్ మిర్రర్):** శాసనసభ ప్రాంగణంలో బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల పోలీసులు, కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తూ మైలార్‌దేవ్‌పల్లి, కాటేదాన్ డివిజన్ల కూడలి దుర్గానగర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రతిపక్ష నాయకులపై ప్రభుత్వం అణచివేత ధోరణి ప్రదర్శిస్తోందని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో విఫలమైందని నాయకులు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గుమ్మడి కుమార్, యువజన అధ్యక్షులు అధ్యక్షుడు అక్కెం రఘు యాదవ్, సీనియర్ నాయకులు బండ రాజేష్ యాదవ్, మహేష్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ప్రవీణ్ గౌడ్, సురేష్ ముదిరాజ్, జగన్ ముదిరాజ్, శ్రీనాథ్ యాదవ్, ఈశ్వర్, వెంకటేష్, ప్రవీణ్, శ్రీకాంత్, నరేష్, శేఖర్, క్రాంతి యాదవ్, ప్రదీప్, రాఘువేందర్, మహేష్, వినోద్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.





# సబితా ఇంద్రారెడ్డి పట్ల పోలీసుల తీరుపై బీఆర్ఎస్ నేతల ఆగ్రహం

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శాసనసభ ప్రాంగణంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తీవ్రంగా ఖండించారు. అత్తాపూర్, రాజేంద్రనగర్ సర్కిల్ బీఆర్ఎస్ సమన్వయకర్త కోలన్ సుభాష్ రెడ్డి, పి. ధర్మారెడ్డి, కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేష్, హైదర్‌గూడ డివిజన్ అధ్యక్షుడు నరేందర్ తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోలన్ సుభాష్ రెడ్డి మాట్లాడుతూ, సీనియర్ మహిళా ప్రజాప్రతినిధి పట్ల పోలీసులు అనుచితంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆరోపించారు. ఈ ఘటనను నిరసిస్తూ శాంతియుతంగా ఆందోళన చేసిన బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేయడం సరికాదని, అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముక్రం ఖాన్, జరుద్దీన్, పోయిల జీవన్‌దాస్, సూర్యం, రమేష్ ముదిరాజ్, తిరుపతి రెడ్డి, యాదయ్య, దుర్గేష్, సునీల్, మల్లేష్, వెంకట్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, నయీమ్ భాయ్, శివ ముదిరాజ్, రామస్వామి, రిషి, మోహన్, సుగుణ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాయిద్య కళాకారులకు గుర్తింపు కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలి

## ప్రజానాట్యమండలి మండల కార్యదర్శి కాల్వ కోటేశ్వరరావు డిమాండ్

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** వాయిద్య కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు పింఛన్లు మంజూరు చేసి ఆదుకోవాలని ప్రజానాట్యమండలి మండల కార్యదర్శి కాల్వకోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనంలో ప్రజానాట్య మండలి నేలకొండపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో బ్యాండ్ మేళం కళాకారుల జనరల్ బాడీ సమావేశం జరిగింది ఈ సందర్భంగా బ్యాండ్ మేళం నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలఅధ్యక్షులుగా చెరువుమాదారం గ్రామానికి చెందిన ముక్కరాల వీరబాబు, ఉపాధ్యక్షులుగా రాజేశ్వరపురం గ్రామానికి చెందిన ఎస్కే సైదా కార్యదర్శిగా వడ్లమూడి రాంబాబు సహాయ కార్యదర్శిగా నాగేశ్వరరావుతో పాటు కమిటీ సభ్యులుగా సత్యం, ధనమూర్తి, శీను, రత్నం, బిక్కు గణేష్, సత్యం, పుల్లయ్య, అశోక్ లనుఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, 60 ఏళ్లు దాటిన వాయిద్య



కళాకారులకు పింఛన్లు మంజూరు చేయాలని, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, ప్రభుత్వం సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10వ తారీఖున ఖమ్మంలో జరిగే బ్యాండ్ మేళం వాయిద్య కళాకారుల ర్యాలీలో వాయిద్య కళాకారులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రజానాట్యమండలి మండల అధ్యక్షులు గాదే వెంకటేశ్వరరావు, గురజాల ఉపేందర్ రావు, దేగల హరిప్రసాద్, మంకెనపల్లి ధనకోటి, శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
మంగళవారం 8-9-2026


# మోకిలా నుంచి శంకర్‌పల్లి వరకు సబర్బన్ బస్సు సర్వీసు కొనసాగించాలి

### కేవలం 5 కిలో మీటర్ల దూరమే

### చేవెళ్ల నియోజకవర్గం ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పి ఏ కి వాట్సప్ లేక అందించిన శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు నరేష్‌కుమార్ .

### బి జె పి.ఎండోమెంట్ సెల్ ధార్మిక రంగారెడ్డి జిల్లా రూరల్ జెయింట్ కన్వీనర్


**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** మోకిలా నుంచి శంకర్‌పల్లి వరకు సబర్బన్ బస్సు సర్వీసును కొనసాగించి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని కోరుతూ శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నరేష్‌కుమార్ చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి పై ఏ కి వాట్సప్ లేక ఈ సందర్భంగా నరేష్‌కుమార్ మాట్లాడుతూ.. శంకర్‌పల్లి మండల పరిధిలోని మోకిలా గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల్లో వేలాది మంది ప్రజలు నివసిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు, చిరు వ్యాపారులు, సామాన్య ప్రజలు ప్రతిరోజూ వివిధ అవసరాల కోసం శంకర్‌పల్లి, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారని పేర్కొన్నారు.మోకిలా ప్రాంతంలో రోజురోజుకూ జనాభా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజా రవాణా అవసరం మరింత పెరిగిందని తెలిపారు. అయితే సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి రావడంతో అదనపు ఆర్థిక భారం పడటంతో పాటు ప్రయాణ భద్రతకు సంబంధించిన సమస్యలు కూడా ఎదురవుతున్నాయని తెలిపారు.అందువల్ల మోకిలా నుంచి శంకర్‌పల్లి వరకు సబర్బన్ బస్సు సర్వీసును పునరుద్ధరించి/కొనసాగించి, అవసరానికి అనుగుణంగా మరిన్ని బస్సులను ఏర్పాటు చేయాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని నరేష్‌కుమార్ కోరారు.ఈ బస్సు సర్వీసు అందుబాటులోకి వస్తే మోకిలా, శంకర్‌పల్లి పరిసర గ్రామాల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని, ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు, రోజువారీ కూలీలు, వ్యాపారులు తక్కువ ఖర్చుతో సురక్షితంగా ప్రయాణించే అవకాశం ఉంటుందని తెలిపారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి మోకిలా--శంకర్‌పల్లి సబర్బన్ బస్సు సర్వీసును త్వరితగతిన కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని నరేష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.



## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్ట్‌కు నిరసనగా నార్సింగ్‌లో ధర్నా

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ నార్సింగ్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.నార్సింగ్ సర్కిల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కె. విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "సీఎం డౌన్ డౌన్" అంటూ నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బ్లాక్ టీ-షర్టులు ధరించి అసెంబ్లీ సమావేశాలకు హాజరైతే ప్రభుత్వానికి ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ పార్లమెంట్ సమావేశాలకు బ్లాక్ టీ-షర్ట్ ధరించి వెళితే ఒక నిబంధన, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు మరో నిబంధనా? అని ప్రభుత్వాన్ని నిలదీశారు.గ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు, 420 హామీల పేరుతో ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజేందర్, మైనారిటీ అధ్యక్షుడు ముక్తార్, గణేష్ ముదిరాజ్, రవి యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, జె.సి. మహాలక్ష్మి, గణేష్ రెడ్డి, మైపాల్, అనిషా బేగం, అరుణ, కవితతో పాటు పలువురు మహిళా కార్యకర్తలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆర్ఆర్ హోటల్ ప్రారంభించిన వేముల విపుల్



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ పరిధిలో జాతీయ రహదారి 65 పక్కన కొండె రఘుపతి,అరూరి రమేష్ లు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ ఆర్ హోటల్ ను సోమవారం ఎమ్మెల్యే వేముల వీరేశం తనయుడు వేముల విపుల్ కుమార్ ప్రారంభించి హోటల్ యజమాన్యంకు శుభాకాంక్షలుతెలిపారు.నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని భోజన ప్రియులకు అందించి కస్టమర్ల మన్ననలు పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వెలిమినేడు సింగల్ విండో చైర్మన్ ఏనుగు రఘుమా రెడ్డి, వైస్ చైర్మన్ బొంతల అంజిరెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జడల చిన్నమల్లయ్య,ఉప సర్పంచ్ అంతటి స్వప్న సత్తయ్య, బొంగొని చెరువు గ్రామ సర్పంచ్ కట్ట ఆశయ్య,సీనియర్ నాయకులు అంతటి నరసింహ గౌడ్, సుర్కంటి సత్తిరెడ్డి,అంశాల సత్యనారాయణ,అంశాల శ్రవణ్ తదితరులు,పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలి: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోకల శ్రీనివాస్ రెడ్డి



గండిపేట్,(క్రైమ్ మిర్రర్): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు పిలుపు మేరకు రాజేంద్రనగర్ శాసనసభ నియోజకవర్గ నాయకుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోకల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు చెల్లించాల్సిన సుమారు పదిహేను వందల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని నిర్వహించ తలపెట్టిన మహాధర్నాకు కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి నిరాకరించడం సరైంది కాదని మండిపడ్డారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఎంతోమంది విద్యార్థుల ఉన్నత విద్యకు ఈ నిధులు కీలకమని, బకాయిలు రాక విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నిర్వహించిన ముట్టడిలో తోకల శ్రీనివాస్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు జి. పాండు యాదవ్, అడికే జనార్ధన్, సంతోష్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, మన్మోహన్ రెడ్డి, తలారి చిన్న, అమర్ రెడ్డి, మాగాణి శివ, పవన్ సాయి, హర్ష వర్ధన్, లంకల సాయి, శంకర్ రెడ్డి, తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మణికొండ అభినందన్ మోటార్స్‌లో నూతన బజాజ్ పల్సర్ ద్విచక్ర వాహనాల ఆవిష్కరణ




**గండిపేట్,(క్రైమ్ మిర్రర్):** నార్సింగి సర్కిల్ పరిధిలోని మణికొండ డివిజన్ అభినందన్ మోటార్స్ బజాజ్ విక్రయాలు, సేవల షోరూంలో సోమవారం నూతన బజాజ్ పల్సర్ ద్విచక్ర వాహనాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పల్సర్ నూట యాభై సీసీ, పల్సర్ నూట ఇరవై ఐదు సీసీ, పల్సర్ ఎన్ నూట అరవై సీసీ ద్విచక్ర వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు సార్వజనిక నిర్వాహకుడు వినోద్ సింగ్ తెలిపారు. మాజీ కౌన్సిలర్ వందన నాగేష్, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్ష్మీశ్రీ చేతుల మీదుగా వాహనాలను ఆవిష్కరించారు. సరికొత్త ద్విచక్ర వాహనాలను వినియోగదారులకు అందుబాటు ధరల్లో షోరూంలో అందుబాటులో ఉంచినట్లు, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సావిత్రి, గంగ, ఇంద్రాణి, శాఖా నిర్వాహకుడు బాలాజీ సూర్యవంశీ, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

### బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కే బి రాజు, మండల ప్రధాన కార్యదర్శి గజ్జి లక్ష్మయ్య

### మండల అభివృద్ధి అధికారికి మెమోరండం అందజేత




క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వేయి రోజులు అవుతున్న ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని, అందుకే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సంపూర్ణంగా అమలు చేయాలని టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కేబి రాజు గుండుమల నర్సింలు టిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి సోమవారం మండల అభివృద్ధి అధికారి రామకృష్ణ నాయక్ కు మెమరండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన మోసపూరితమైన హామీలు మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు 2500/-, రైతులకు ఉచిత విద్యుత్తు రెండు లక్షల రుణమాఫీ, రైతు కూలీలకు ప్రతి సంవత్సరము 12000 రూపాయలు, ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లును కట్టిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, అర్హులైన నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి జాబ్ క్యాలెండర్ను అమలు చేయాలని, విద్యార్థులకు ఫీజు బకాయిలను చెల్లించాలని వృద్ధులకు వితంతువులకు బీడీ కార్మికులకు నెలకు 4000 రూపాయలు పించను చెల్లించాలని, ఆటో పనులకు సంవత్సరానికి 12,000 చెల్లిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని అవి కూడా అమలు చేయాలని, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ హామీలను అమలు కాని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిరసనలు చేపడుతామని వారు మెమొరండంలో సూచించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుడిమల్ల నర్సింలు కడంపల్లి రఘు, కొండయ్య బృంగి శ్రీశైలం గజ్జి వెంకటయ్య, చంద్రయ్య మల్కయ్య బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అడ్డుకున్నారంటూ.. ఆగ్రహం!



### బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మద్దతుగా నిరసన

### మిర్యాలగూడలో మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు ఆధ్వర్యంలో భారీ ఆందోళన

**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, సెప్టెంబరు 7:** బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి వెళ్లకుండా అడ్డుకున్నారంటూ ఆ పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. నాయకులు, ప్రజాప్రతినిధులపై పోలీసులు అణచివేత ధోరణితో వ్యవహరించారని ఆరోపిస్తూ సోమవారం మిర్యాలగూడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు కార్యక్రమానికి నాయకత్వం వహించారు.బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి భారీ ర్యాలీగా ఆర్టీసీ బస్టాండ్ వరకు చేరుకున్నారు. చేతుల్లో నిరసన ప్లకార్డులు ప్రదర్శిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించి తమ నిరసనను వ్యక్తం చేశారు.

**'ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారు'**

ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి వెళ్లకుండా అడ్డుకోవడం సరికాదన్నారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులపై పోలీసులతో అణచివేత చర్యలకు పాల్పడటం దుర్మార్గమని విమర్శించారు.ప్రతిపక్షాల గొంతు నొక్కడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు, ప్రతిపక్షాల హక్కులను పరిరక్షించేందుకు బీఆర్ఎస్ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తిప్పన విజయసింహారెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎడవెల్లి శ్రీనివాసరెడ్డి, అన్నబీమోజు నాగార్జునచారి, ఎండీ. ఇలియాస్‌ఖాన్, ధనావత్ చిట్టిబాబు నాయక్, ఎండీ. మగ్దుంపాషా, ఎండీ. మాజీద్, పద్మశెట్టి కోటేశ్వరరావు, గంగుల బిక్షం, రావూరి సుధాకర్, చంద్రశేఖర్‌రావు, రవి, దుర్గాప్రసాద్, మట్టపల్లి సైదులు యాదవ్, ఎండీ. షోయబ్, యర్రమల్ల దినేష్, చౌగాని బిక్షంగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, జానయ్య, జక్క నాగేశ్వరరావు, సూర్యానాయక్, ధనావత్ వెంకటేశ్వర్లునాయక్, పిసికె ప్రసాద్, ఎలకాని రమణ, పాశం నరసింహారెడ్డి, పులి జగదీష్, వింజం శ్రీధర్, పెండ్యాల పద్మ, షహనాజ్ బేగం, కె.రమా, పెరుమాళ్ల ధనమ్మ, లలిత, శ్రీనునాయక్, తుమ్మల ఫణికుమార్ తదితరులతో పాటు నాయకులు, ప్రజాప్రతినిధులు, వార్డు ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలి

### కుల్కచర్ల మండల అధికారి రామకృష్ణ నాయక్

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని ప్రజలు ప్రతి సోమవారం ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఏమైనా సమస్యలు ఉంటే ప్రజావాణిలో దరఖాస్తు చేసుకొని పరిష్కరించుకోవాలని కుల్కచర్ల మండల అధికారి రామకృష్ణ నాయక్ సూచించారు. సోమవారం మండల అభివృద్ధి కార్యాలయంలో ప్రజావాణిని అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో ప్రతి సోమవారం రోజు వివిధ గ్రామాల ప్రజలకు ఉన్న సమస్యలను నేరుగా దరఖాస్తు చేసుకుని పరిష్కరించుకోవాలని వారు తెలిపారు. సోమవారం రెవెన్యూకు సంబంధించిన రెండు దరఖాస్తులు వచ్చాయని వాటిని సంబంధిత అధికారులకు పంపించి పరిష్కరించే దిశగా కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ తహసిల్దార్ చంద్రశేఖర్, ఏపిఎం శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ మణికుమార్, పిహెచ్ సి హెల్త్ అసిస్టెంట్ రామ్ నరసయ్య, ఫారెస్ట్ అధికారి పీర్యా నాయక్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



# కోదాడలో సెప్టెంబర్ 19న మెగా జాబ్ మేళా

## నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాల కల్పనే లక్ష్యం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

## సి.సి. రెడ్డి కాన్వెంట్ స్కూల్‌లో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహణ



**కోదాడ సెప్టెంబర్ 07 (క్రైమ్ మిర్రర్):** కోదాడ : నిరుద్యోగ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రైవేట్ సంస్థలు, నైపుణ్యాభివృద్ధి సంస్థలు సమష్టిగా నిరంతర కృషి చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. నిరుద్యోగ సమస్య ఒక్కరోజులో లేదా ఒక్క జాబ్ మేళాతో పరిష్కారం కాదని, యువత విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా నిరంతరంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రణాళికాబద్ధమైన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 19వ తేదీ శనివారం కోదాడ పట్టణంలోని సి.సి. రెడ్డి కాన్వెంట్ స్కూల్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరిగే ఈ జాబ్ మేళాలో వివిధ సంస్థలు పాల్గొని అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమల శాఖ, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అవసరమైన ఆర్థిక సహాయాన్ని సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధుల ద్వారా అందించనున్నట్లు మంత్రి తెలిపారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతను నేరుగా నియామక సంస్థలతో అనుసంధానం చేయడమే జాబ్ మేళా ప్రధాన ఉద్దేశమన్నారు. తన 32 ఏళ్ల ప్రజాజీవితంలో ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా, టీపీసీసీ అధ్యక్షుడిగా సాధ్యమైనంతమంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేశానని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. భవిష్యత్తులోనూ ఈ కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని చెప్పారు.

**హుజూర్‌నగర్ జాబ్ మేళాకు విశేష స్పందన**

2025 అక్టోబర్‌లో నిర్వహించిన హుజూర్‌నగర్ మెగా జాబ్ మేళాకు సుమారు 40 వేల మంది నమోదు చేసుకోగా, 20,463 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని మంత్రి గుర్తుచేశారు. వారిలో 2,041 మంది ఉద్యోగాలకు ఎంపిక కాగా, మరో 1,533 మంది తదుపరి నియామకాల కోసం షార్ట్‌లిస్ట్ అయ్యారని తెలిపారు. మొత్తంగా 3,574 మంది యువతకు ప్రత్యక్షంగా లేదా భవిష్యత్తులో ఉపాధి పొందే అవకాశం లభించిందని పేర్కొన్నారు. పద్మావతి రెడ్డి కన్వీనర్‌గా కమిటీకోదాడ మెగా జాబ్ మేళా నిర్వహణ కోసం కోదాడ ఎమ్మెల్యే శ్రీమతి ఎన్. పద్మావతి రెడ్డి కన్వీనర్‌గా నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. నల్గొండ ఎంపీ కె. రఘువీర్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ, కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, కోదాడ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ, వైస్ ఛైర్‌పర్సన్ మల్లేశ్వరి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కోటేశ్వరరావుతో పాటు పరిశ్రమల శాఖ, సింగరేణి సంస్థ ప్రతినిధులు కమిటీ సభ్యులుగా ఉంటారని వెల్లడించారు. అభ్యర్థుల నమోదు, వివిధ కంపెనీల భాగస్వామ్యం, ప్రచారం, ఇంటర్వ్యూ సదుపాయాలు, రవాణా, భద్రత, ఆహారం, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లను కమిటీ సమన్వయం చేయనుంది. కార్యక్రమం తేదీ సమీపించే నాటికి మరికొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులను కూడా కమిటీలో చేర్చనున్నట్లు మంత్రి తెలిపారు. జాబ్ మేళా నిర్వహణ కమిటీ తొలి సమావేశం సెప్టెంబర్ 10న సాయంత్రం 5 గంటలకు సచివాలయంలో నిర్వహించనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు తగిన ఉద్యోగాలను సాధించుకోవాలని ఆయన సూచించారు.



## నీట్‌లో సీటు సాధించిన విద్యార్థికి రామకృష్ణారెడ్డి రూ.50 వేల ఆర్థిక సహాయం

గండిపేట(క్రైమ్ మిర్రర్): పీఎం-శ్రీ జెడ్పీహెచ్ఎస్ మణికొండ పాఠశాలలో 2022లో పదో తరగతి పూర్తి చేసిన యు. భార్గవ్ అశోక్ కుమార్ నీట్-2026లో ప్రతిభ కనబరిచి డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి వైద్య కళాశాలలో మెడికల్ సీటు సాధించారు. ఈ సందర్భంగా మణికొండ మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి అభినందనలు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ భార్గవ్ అశోక్ కుమార్ ఇంటర్మీడియట్‌లో టిఎస్ఆర్జెసి సర్వేల్‌లో 955/1000 మార్కులు సాధించి, అనంతరం నీట్‌లో మెడికల్ సీటు సాధించారు. విద్యార్థి కుటుంబ పరిస్థితులను తెలుసుకున్న రామకృష్ణారెడ్డి ఉన్నత చదువులకు అండగా రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. భార్గవ్ భవిష్యత్తులో మంచి వైద్యుడిగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. సహాయం అందించిన రామకృష్ణారెడ్డికి విద్యార్థి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా బీరప్ప బోనాలు



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం మొగల్ దొరి గ్రామంలో ఘనంగా బీరప్ప బోనాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో రేగులగడ్డ స్వామి గౌడ్, ఉపసర్పంచ్ బొమ్మగాని లింగస్వామి గౌడ్ ,శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ మంగమ్మ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ రామలింగేశ్వర స్వామి చిన్న జాతర ఉత్సవాలు



క్రైం మిర్రర్ కుల్కచర్ల: వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని బండవెల్లికిచెర్ల గ్రామంలోని ఏకశిలా పర్వతం పై కొలువై ఉన్న శ్రీ రామలింగేశ్వర చిన్న జాతర ఉత్సవాలు సోమవారం శ్రావణ మాస సందర్భంగా ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా సోమవారము ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి తమ మొక్కులను తీర్చుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. సాయంత్రం స్వామివారికి షకటోత్సవం నిర్వహించడం జరిగింది. భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో రావడంతో రద్దీగా ఏర్పడకుండా పోలీస్ బందోబస్తు అన్ని విధాలుగా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి, గ్రామ సర్పంచ్ శ్రీనయ్య కమిటీ సభ్యులు అందరూ పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసి చిన్న జాతర ఉత్సవాల ఘనంగా జరిపించారు.

# అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

## బాల్కసుమన్ కు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి,వోడ్నాల శ్రీనివాస్ సవాల్

## వ్యక్తిగత విమర్శలు మానకుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరిక

## పదేళ్ల బిఆర్ఎస్ హయాంలో రూ.వందల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపణ



**రామకృష్ణాపూర్ సెప్టెంబర్ 7 (క్రైమ్ మిర్రర్):** బీఆర్ఎస్ పాలనలో పదేళ్లపాటు అధికారాన్ని అనుభవించిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కాంగ్రెస్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..బాల్క సుమన్ మాజీ ఎంపీ, ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమిటో, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ చేపట్టిన అభివృద్ధి ఏమిటో ప్రజల ముందు ఉంచేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇరువురి అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేసి బహిరంగ చర్చకు రావాలని బాల్క సుమన్‌కు సవాల్ విసిరారు.

**అక్రమాలపై ప్రజలకు వివరిస్తాం**

విమర్శలకు సమాధానం చెప్పడం తమ ఉద్దేశం కాదని, బాల్క సుమన్ హయాంలో జరిగిన అక్రమాలు, అవినీతి వ్యవహారాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత తమపై ఉందని రఘునాథ్‌రెడ్డి తెలిపారు. సింగరేణి బొగ్గు గనులను ప్రైవేటుపరం చేసే టెండర్లకు మద్దతుగా ఎంపీగా ఉన్న సమయంలో పార్లమెంటరీ కమిటీలో సుమన్ సంతకం చేశారా? లేదా? అని ప్రశ్నించారు. సింగరేణి టెండర్లలో పాల్గొనకూడదని అప్పటి ప్రభుత్వం నిర్ణయించినప్పుడు కార్మికులు, వారి పిల్లల భవిష్యత్తు కోసం ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. బీఆర్ఎస్ హయాంలో మెడికల్ అన్‌ఫిట్ వ్యవహారంలో రూ.3.5 కోట్ల మేర, ఇసుక రీచ్‌ల నిర్వహణలో రూ.200 కోట్ల నుంచి రూ.500 కోట్ల వరకు అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ధాన్యం పంపిణీ పేరుతో రైస్‌మిల్లర్లను బెదిరించి వసూళ్లకు పాల్పడ్డారని పేర్కొన్నారు.

**కాకా కుటుంబానికి సింగరేణితో అనుబంధం:** కాకా వెంకటస్వామికి రాజకీయాల్లో స్వచ్ఛమైన చరిత్ర ఉందని రఘునాథ్‌రెడ్డి కొనియాడారు. 1998--99లో సింగరేణి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ఎన్టీపీసీ ద్వారా రూ.420 కోట్ల వడ్డీలేని రుణం తీసుకువచ్చి సంస్థను, కార్మికులను కాపాడిన ఘనత ఆయనదేనన్నారు. ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తూ మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణ ప్రజాసేవకు అంకితమయ్యారని చెప్పారు.

**కొత్త ప్రాజెక్టులతో వేలాది ఉద్యోగాలు**

ఎంపీ వంశీకృష్ణ పోరాడి తాడిచర్ల-2 మైన్‌కు, మంత్రి వివేక్ చొరవతో రామకృష్ణాపూర్ ఆఆర్‌కే-ఓసీ ఫేజ్-2కు అటవీ అనుమతులు సాధించారని తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 3,000 నుంచి 5,000 మందికి ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. ఇప్పటికే వివిధ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల ద్వారా 1,500 మందికి పైగా ఉపాధి లభించిందని, జైపూర్ థర్మల్ పవర్ ప్లాంట్ రెండో యూనిట్ ద్వారా మరో 300 ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయని వివరించారు.

**అభివృద్ధికి భారీగా నిధులు**

మౌలిక వసతులకు రూ.60 కోట్లు, పట్టణాభివృద్ధికి రూ.32 కోట్లు, నియోజకవర్గ అభివృద్ధికి రూ.30 కోట్లు, ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు రూ.240 కోట్లు, అమృత్ పథకానికి రూ.72 కోట్లు, పంచాయతీరాజ్‌కు రూ.80 కోట్లు, విద్యుత్ రంగానికి రూ.90 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అలాగే వందే భారత్ రైలుకు స్టాపేజ్ సాధించడంతో పాటు రామగుండం-మణుగూరు రైలు మార్గం కోసం ఎంపీ కృషి చేస్తున్నారన్నారు. ఏడాది పాలనలోనే 72,600కు పైగా ఉద్యోగాలను భర్తీ చేశామని, ఆరు గ్యారంటీల్లో ఐదింటిని అమలు చేశామని తెలిపారు.

**మీడియా అటెన్షన్ కోసమే విమర్శలు: ఓడ్నాల శ్రీనివాస్**

ఓటమి భయంతోనే సుమన్ మీడియా అటెన్షన్ కోసం చవకబారు రాజకీయాలకు పాల్పడుతున్నారని వోడ్నాల శ్రీనివాస్ విమర్శించారు. హైదరాబాద్‌లో ఉంటూ నియోజకవర్గానికి అప్పుడప్పుడు వచ్చి ఆరోపణలు చేయడం పరిపాటిగా మారిందన్నారు. గతంలో మంత్రి కాన్వాయ్‌పై రాళ్లదాడి, జీఎం కార్యాలయాన్ని తగలబెట్టాలంటూ చేసిన వ్యాఖ్యలను గుర్తుచేస్తూ, ప్రజల్లో అలజడి సృష్టించే ప్రయత్నాలు చేయవద్దని హితవు పలికారు. టామ్‌కామ్, ఏటీసీ కేంద్రాల ద్వారా శిక్షణ పొంది యువత విదేశాల్లో రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు సంపాదిస్తుంటే, విదేశీ ఉపాధిపై చిల్లర వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. గతంలో కేటీఆర్ అమెరికాలో ఉద్యోగం చేయలేదా అని ప్రశ్నించారు.

**అనుచిత వ్యాఖ్యలు సహించేది లేదు:**

కష్టపడి చదివిన నిరుద్యోగ యువతను ధర్నాలు, అల్లర్ల వైపు ప్రేరేపించి వారి భవిష్యత్తుతో చెలగాటం ఆడవద్దని కాంగ్రెస్ నేతలు విజ్ఞప్తి చేశారు. మంత్రి, ఎంపీలపై వ్యక్తిగత దూషణలు, నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అభివృద్ధి పనులకు అడ్డంకులు సృష్టించడం మాని, నియోజకవర్గ అభివృద్ధికి ప్రతిపక్షాలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఎస్సి సెల్ కార్యదర్శి చందనగిరి శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎర్రబెల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని ఆయన కు క్షమాపణ చెప్పాలి..

## తాతా మధు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు

## తెలంగాణ శాసన సభ స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధు దిష్టిబొమ్మ దగ్ధం

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ నేలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడటం ఏమాత్రం సమర్థనీయం కాదని ఆయన అన్నారు. అసభ్య పదజాలంతో బూతులు తిట్టడం దీ=ూ పార్టీ నేతల అహంకారానికి అద్దం పడుతోందని ఆయన అన్నారు. దళిత స్పీకర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కాదని, రాజ్యాంగ వ్యవస్థను, శాసనసభ గౌరవాన్ని అవమానించడమేనని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. తాత మధు ను సస్పెండ్ చెయ్యాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొడాలి గోవుందా రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మామిడి వెంకన్న, బచ్చలకూర నాగరాజు, జెగ్రిపుతుల సత్యనారాయణ, ఈవూరి శ్రీనివాసరెడ్డి, వంగవీటి నాగేశ్వరావు, రాయపూడి నవీన్, జెగ్రీపోతుల అంజనీ,సీత నాయక్, లక్కం కొండలు, కొమ్మరి నరేష్,యడవల్లి శ్రీను,వెంకటేశ్వర్లు, నాగ ప్రసాద్, మాలోత్ అయోధ్య రామయ్య, రవి, రామకృష్ణ, వీరబాబు, నరేష్, సత్యం మేస్త్రి తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.